ప్రైవేటు బస్సుల తనిఖీలు

-పలు వాహనాలు సీజ్

హైదరాబాద్, అక్టోబరు 25 ప్రభాతవార్త

కర్నూలులో కావేరీ ట్రావెల్స్ బస్సు ప్రమాదం నేపథ్యంలో రవాణా శాఖ(ఆర్టీఏ) అధికారులు అప్రమత్తమయ్యారు. నగరంతోపాటు శివార్లలో విస్తృతంగా ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు, వాహనాలను తనిఖీలు చేస్తున్నారు. విజయవాడ హైవే, బెంగళూరు హైవేపై ఆర్టీఏ బృందాలు విస్తృత తనిఖీలు చేపట్టాయి. రాజేంద్రనగర్ పరిధి గగన్‌పహాడ్ వదనద సోదాలు చేశారు. ఏపీ నుంచి వస్తున్న ట్రావెల్స్ బస్సులను తనిఖీ చేశారు. వాహనాల్లోని ఫైర్ సేఫ్టీ, మెడికల్ కిట్లను పరిశీలించారు. డ్రంకన్ డ్రైవ్, బీమా, ఫిట్‌నెస్, పర్మిట్ పత్రాలు, బస్సు లోపల భద్రతను పరిశీలిస్తున్నారు. పర్మిట్ లేకుండా వెళ్తున్న బస్సులపై, నిబంధనలు పాటించని పలు బస్సులపై కేసులు నమోదు చేశారు. అనుమతి లేకుండా నడుపుతున్న ట్రావెల్స్ బస్సులను సీజ్ చేశారు. నిబంధనలు పాటించని 5 ట్రావెల్స్ బస్సులపై కేసులు నమోదు చేశారు. బస్సు అద్దం పగిలినా అలాగే నడుపుతున్న ట్రావెల్స్ బస్సును సీజ్ చేశారు. ఎల్బీనగర్‌లోని చింతలకుంట వద్ద ఆర్టీఏ అధికారులు తనిఖీలు చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన ట్రావెల్స్ బస్సును సీజ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా రోడ్లపై తిరుగుతునన మరో 4 బస్సులపై కేసులు నమోదు చేశారు. మరోవైపు..శుక్రవారం రాత్రి హయత్‌నగర్, ఎల్బీనగర్, కూకట్‌పల్లి ఎం.వి.ఐ శీను బాబు ఆధ్వర్యంలో అధికారులు సుమారు 15కుపైగా ప్రవేట్ బస్సులను విస్తృతంగా తనిఖీ నిర్వహించారు. బస్సులకు సంబంధించి ఎమర్జెన్సీ డోర్లు తెరుచుకోకపోవడం, ఆయా బస్సుల్లో ఫైర్ ఏక్స్టింగ్ యూసర్‌లు పనిచేయకపోవడం, ప్రమాదం జరిగినప్పుడు అద్దాలను పగులగొట్టే పరికరాలు (బ్రేక్ గ్లాస్ హేమర్) లేకపోవడాన్ని గుర్తించారు. ఈ సందర్భంగా నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న వేమూరి కావేరి ట్రావెల్స్‌కు సంబంధించిన బస్సును అధికారులు సీజ్ చేశారు. అలాగే మరో బస్సుకు రవాణా అనుమతులు రద్దు చేశారు. అదేవిధంగా ఆటోలు, క్యాబ్‌ల్లో పోలీసులు తనిఖీలు చేపట్టారు. లైసెన్స్, సరైన పత్రాలు లేని వాహనాలపై కేసులు నమోదు చేశారు. వాహనాలపై ఉన్న చలాన్లను వసూలు చేశారు. చలాన్లను చెల్లిస్తేనే వెళ్లేందుకు అనుమతి ఇస్తున్నారు. కాగా, శుక్రవారం తెల్లవారుజామున కర్నూలు శివారు చిన్నటేకూరు వద్ద కావేరి ట్రావెల్స్ బస్సు కాలి బూడిదైన విషయం తెలిసిందే. బస్సు బైక్‌ను ఢీకొట్టడంతో ఈ ఘోరం జరిగింది. ఈ ప్రమాదంలో 19 మంది సజీవ దహనమయ్యారు. బైక్‌పై వెళ్తున్న వ్యక్తి కూడా దుర్మరణం చెందాడు.

నగరంలో దంచికొట్టిన వర్షం..

-పలుప్రాంతాల్లో రోడ్లపై నిలిచిన నీరు- ట్రాఫిక్‌జామ్..వాహనదారులకు ఇబ్బందులు

హైదరాబాద్, అక్టోటబరు 25,ప్రభాతవార్త: భాగ్యనగరంలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. శనివారం ఉదయం నుంచి ఎండగా ఉన్నప్పటికీ అంతలోనే ఆకాశం మేఘావృతం అయ్యింది. ఉన్నట్టుండి వర్షం కురిసింది. నగరంలోని పలు ప్రాంతాల్లో దంచికొట్టింది. దీంతో రోడ్లపై ఎక్కడికక్కడ వర్షపు నీరు నిలిచిపోయింది. మాదాపూర్, హైటెక్ సిటీ, గచ్చిబౌలి, కొండాపూర్, రాయదుర్గం, హఫీజ్‌పేట్‌లో భారీ వర్షం పడింది. మియాపూర్, చందానగర్, బీహెచ్ఈఎల్, మదినగూడ, నిజాంపేట్, బాచుపల్లి, దుండిగల్, మల్లంపేట ప్రాంతాల్లో పెద్ద ఎత్తున వర్షం కురిసింది. అలాగే జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఖైరతాబాద్, పంజాగుట్ట, సోమాజిగూడ, నాంపల్లి, మాసబ్ ట్యాంక్, మెహదీపట్నం, టోలిచౌకి లోనూ కుండపోతగా వర్షం కురుస్తోంది. కూకట్‌పల్లి,మూసాపేట్, సనత్ నగర్, ఎర్రగడ్డ, ఎస్ఆర్ నగర్‌లో కూడా ఎడతెరపి లేకుండా వర్షం పడింది. ఈదురుగాలుల తీవ్రతకు పలు ప్రాంతా ల్లో చెట్లు విరిగిపడ్డాయి.

మరోవైపు వర్షపు నీటితో రోడ్లన్నీ చెరువులను తలపిస్తున్న పరిస్థితి నెలకొంది. ఎస్ఆర్ నగర్, అమీర్‌పేట్ మార్గంలో భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది.

భారీ వర్షం కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

బిసి అభ్యర్థిపై కెసిఆర్ చేసిన వ్యాఖ్యలు తక్షణమే ఉపసంహరించుకోవాలి

-బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్

సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్

ముషీరాబాద్, అక్టోబర్ 25, ప్రభాతవార్త: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ తరఫున బరిలో ఉన్న బీసీ అభ్యర్థి నవీన్‌యాదవ్‌పై బీఆర్ఎస్ అధ్యక్షులు కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను తక్షణమే ఉపసంహరించుకోవాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో వివిధ బీసీ సంఘాల నేతలతో కలసి ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎంతో విద్యా వంతుడు, సామాజిక సేవకుడు అయిన నవీన్‌యాదవ్‌ను రౌడీ షీటర్ అంటూ కేసీఆర్ వ్యాఖ్యానించటం ఆయన అహంకారానికి నిదర్శనమని అన్నారు. బీఆర్ఎస్, బీజేపీలు అగ్రవర్ణాల అభ్యర్థులకు టిక్కెట్లు ఇస్తే కాంగ్రెస్ పార్టీ ఒక బీసీ అభ్యర్థికి టిక్కెట్ ఇచ్చిందని, జూబ్లీహిల్స్‌లో గెలిచేది బీసీ అభ్యర్థే కాబట్టి, బీసీ అభ్యర్థి విజయాన్ని తట్టుకోలేక కేసీఆర్ ఇటువంటి వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు కేవలం నవీన్ యాదవ్ మీద మాత్రమే కాదని, ఇది యావత్ బీసీ సమాజాన్ని అవమానపరిచే వ్యాఖ్యలని మండిపడ్డారు.

బీసీలను మోసం చేయటంలో బీఆర్ఎస్‌కు సాటి ఎవరూ లేరని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ వాళ్లే నిజమైన రౌడీలని, బీసీ బిడ్డను పట్టుకుని రౌడీ అంటే ఊరుకోబోమని హెచ్చరించారు. శ్రీశైలం యాదవ్ కొడుకు నవీన్‌యాదవ్ అని, వారు ప్రజల కోసం పోరాడిన వారే తప్ప వారు ఎలాంటి నేరాలు చేయలేదని స్పష్టం చేశారు. బీసీలపై కేసీఆర్ వాడిన బలుపు మాటలకు ఓటు అనే ఆయుధంతో పోటు పొడవాలని, రాజకీయంగా కేసీఆర్‌ను బొంద పెట్టాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీసీ కుల సంఘాల జేఏసీ ఛైర్మన్ కుందారం గణేష్‌చారి, బీసీ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షులు కే.పి.మురళికృష్ణ, అఖిల భారత విశ్వబ్రాహ్మణ మహాసభ అధ్యక్షులు జగన్నాధం, తెలంగాణ గంగపుత్ర సంఘం నేత దీది మల్లయ్య, ప్రొఫెసర్ భాగయ్య, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు కుల్కచర్ల శ్రీనివాస్‌ముదిరాజ్, బీసీ మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు బి.మనిమంజరి, మహిళా నేత సమతాయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కొండపూర్‌లో రూ.86 కోట్ల విలువైన భూమిని కాపాడిన హైడ్రా

హైదరాబాద్, అక్టోబర్ 25, ప్రభాతవార్త: రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కొండపూర్లో మరో పెద్ద భూకబ్జాను హైడ్రా అడ్డుకుంది. దాదాపు రూ.86 కోట్ల విలువైన భూమిని కాపాడింది. శుక్రవారం రాఘవేంద్ర కాలనీలో 2000 గజాల పార్కు స్థలాన్ని కాపాడిన హైడ్రా, ఆ దగ్గరలోనే ప్రజావసరాలకు ఉద్దేశించిన 4300 గజాల స్థలాన్ని శనివారం కాపాడింది. కొండపూర్, రాజరాజేశ్వరి నగరంలోని ఉస్మానియా యూనివర్సిటీ టీచర్స్ వెల్ఫేర్ సొసైటీలో 4300 గజాల స్థలానికి కబ్జాల చెర నుంచి విముక్తి హైడ్రా విముక్తి కల్పించింది. 1978 లో వేసిన గ్రామ పంచాయతీ లేఅవుట్‌లో మొత్తం 350 ప్లాట్లు ఉన్నాయి. ఇక్కడ పాఠశాల భవనంతో పాటు ఇతర ప్రజావసరాల కోసం 4300 గజాల స్థలాన్ని అప్పట్లో లేఅవుట్ చేసిన చింతల పోచయ్య, ఆయన కుటుంబ సభ్యులు చూపించారు. అదే స్థలాన్ని లేఔట్ వేసిన పోచయ్య తో పాటు ఆయన కుటుంబ సభ్యుడు చింతల రాజు 3 భాగాలుగా విడదీసి లావాదేవీలు నిర్వహించడంలో కొళ్ల మాధవ రెడ్డి హస్తం ఉందని తప్పుడు డాక్యుమెంట్లతో అమ్మకాలు చేశారంటూ వాపోయారు. కొళ్ల మాధవరెడ్డి కుమారుడు ఒక భాగాన్ని కొనగా.. చింతల పోచయ్య, చింతల రాజు పేరిట మీద రెండు భాగాలు ఉన్నట్టు డాక్యుమెంట్లు సృష్టించారు. ఈ మూడు భాగాల్లో కొళ్ల మాధవరెడ్డి డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ కుదుర్చుకుని దందా నడుపుతున్నారు. ఇదే విషయాన్ని కాలనీ ప్రతినిధులు బిబీలీదికి గతంలో ఫిర్యాదులు చేశారు. ఎలాంటి చర్యలు తీసుకేదని వాపోయారు. దీంతో హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేసారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశాల మేరకు సంబంధిత అధికారులతో హైడ్రా క్షేత్రస్థాయిలో పరిశీలించింది. ఆక్రమణలు నిజమే అని నిర్ధారించుకున్నాక శనివారం అక్కడ ఆక్రమణలను తొలగించింది. 4300 గజాల స్థలం చుట్టూ ఫెన్సింగ్ వేసి హైడ్రా బోర్డులను ఏర్పాటు చేసింది. అలాగే అక్కడ భూమిని అమ్మిన పోచయ్య, రాజుతో పాటు స్థలాన్ని కొన్న కొళ్ల మాధవరెడ్డి తో పాటు అతని కుమారుడిపైన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్లో క్రిమినల్ కేసులను నమోదు చేశారు.

హైదరాబాద్ వార్త

కండల కోసం స్టెరాయిడ్స్..!

- ఆరోగ్యం పణంగా పెడుతున్న యువత
- మెఫన్ టెర్మైన్ సల్ఫేట్ ఇంజెక్షన్ వినియోగం
- జిమ్‌కు వెళ్లే వారిలోనే అత్యధికంగా వాడకం

హైదరాబాద్, అక్టోబరు 25,ప్రభాతవార్త: కండల కోసం యువతరం పక్కదారులు పడుతోందా..? సిక్స్ ప్యాక్‌కోసం జిమ్‌లు ప్రాణాలే బలిపెడుతున్నాయా ? అసలు జిమ్‌ల పేరుతో జరుగుతున్న అక్రమ ఇంజక్షన్ల దందా ఏమిటీ ? ఇలా ఎన్నో ప్రశ్నలు ..సందేహాలు ఈసమయంలోనే జిమ్‌ల మాటున జరుగుతున్న దారుణాలను తెరపైకి తెచ్చారు డ్రగ్స్ కంట్రోల్ విభాగం అధికారులు. యువతరానికి సిక్స్ ప్యాక్ ఓక్రేజ్ ,కండల వీరుడు సల్మాన్‌ఖాన్‌లా కనిపించాలనే తాపత్రయం దీంతో ఆరోగ్యాన్ని కూడా లెక్కచేయకుండా ప్రాణాలను ఫణంగా పెట్టి ఈ మెఫెంటెర్మైన్ ..ఇంజక్షన్లు తీసుకుంటాన్నారు. నగరంలో భారీగా పట్టుబడ్డ డ్రగ్స్ కండల వీరుల వెనక అసలు వాస్తవాలను నగ్నంగా బయటపెడుతన్నాయి. జిమ్‌కు వచ్చే వారికి ఎడాపెడా ప్రమాదకర మెఫెంటెర్మైన్ సల్ఫెట్ ఇంజక్షన్లను వాడి ప్రాణాలకే ముప్పు తెస్తున్నారు. తాజాగా శుక్రవారం హైదరాబాద్ వ్యాప్తంగా ఉన్న జిమ్ లలో డ్రగ్ కంట్రోల్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. కండలు పెరుగుతాయంటూ యువతకు ప్రాణాంతక ఇంజెక్షన్లు జిమ్ నిర్వాహకులు ఇస్తున్నట్లు గుర్తించారు. ఇటీవల ఓ జిమ్ లో మెఫెంటర్మిన్ అనే ఇంజెక్షన్లు పట్టుబడ్డాయి దీంతో మిగతా జిమ్‌లపైనా ఫోకస్ చేశారు.

ఇంజెక్షన్ల వల్ల ప్రాణాలకు ముప్పు ..

జిమ్ చేస్తూనే కుప్పకూలిపోతున్న యువతరం దృశ్యాలు యావత్ సమాజాన్ని కలవర పెడుతున్నాయి. జిమ్‌కి వెళ్ళి భారీ కసరత్తులు చేసే వాళ్లు అత్యంత ఆరోగ్యంగా ఉండాల్సింది పోయి ..ఎందకిలా టపాటపా రాలిపోతున్నారు. ఇదే ప్రశ్న ఇటీవల అందర్ని హడలెత్తిస్తోంది. ఆరోగ్యం కోసం జిమ్‌కి వెళితే ఫర్వాలేదు. కానీ కండల వీరులుగా మారాలనుకునే వారు త్వరగా కండలు పెరిగేందుకు మెఫెంటెర్మైంన్ సల్ఫేట్ ఇంజెక్షన్లు వాడుతున్నారు. అయితే ఈఇంజెక్షన్లు వాడితే ప్రాణాలకే ముప్పుఅంటున్నారు నిపుణులు. కొన్ని శస్త్రచికిత్సల్లో వాడే ఈ ఇంజెక్షన్లను కండలు పెంచేందుకు విపరీతంగా వినియోగిస్తున్నట్లు గుర్తించారు. యాంటీ హైపోటెన్సివ్ కేటగిరీలోకి వచ్చే ఈఇంజక్షన్లను బిపి చికిత్స కోసం వినియోగిస్తారు. అంతేకాదు ఆపరేషన్ల సమయంలో హార్ట్‌బీట్‌ని కంట్రోల్ చేసేందుకు ఉపయోగిస్తారు. కానీ ఇవే ఇంజక్షన్లను కండలపెంపకానికి ఉపయోగించి జనం ప్రాణాలను తీసేస్తున్నారు. మెఫెంటెర్మైంన్ ఇంజెక్షన్ల ధర సాధారంగా రూ.300 లోపు ఉంటుంది. కానీ ఇదేఇంజక్షన్ జిమ్‌లలో 1000 వరకు అమ్మి లక్షల్లో డబ్బు దండుకుంటున్నారు. డాక్టర్ ప్రిస్క్రిప్షన్‌తో అమ్మాల్సిన ఈఇంజెక్షన్లు మందుల షాపుల్లో యథేచ్ఛగా అమ్ముతుండటంతో కూడా ఈడ్రగ్స్ దందాకి ఉపయోగపడుతున్నాయి. అంతేకాదు ..ఇతర రాష్ట్రాల నుంచి కూడా ఈడ్రగ్స్ ని రాష్ట్రంలోకి దిగుమతి చేసుకుంటున్నారంటే కండల మోసం ఎంత భయానకంగా మారిందో అర్థం చేసుకోవచ్చు.

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం పేపర్లకే పరిమితమైంది

- బిజెపి ఎమ్మెల్యే పాయల శంకర్

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయల శంకర్, చిత్రంలో సంగప్ప, తాడూరి తదితరులు ఉన్నారు.

జూబ్లీహిల్స్, అక్టోబరు 25, ప్రభాతవార్తః ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం పేపర్లకే పరిమితమైందని, ప్రభుత్వం తరుపు నుండి ఎలాంటి చర్యలు లేవని బీజేపీ ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. కాళేశ్వరం విషయంలోనూ ప్రభుత్వ వైఖరి ఇందుకు తీసిపోని విధంగా ఉందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ లోపాయికారి ఒప్పందంతో ముందుకు సాగుతున్నాయనడానికి ఇవే నిదర్శనమన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల నేపథ్యంలో బీజేపీ పార్టీ ప్రచారానికి విచ్చేసిన ఆయన మీడియాతో మాట్లాడారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో మోసాలు, రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో దోపిడీలు జరిగాయన్నారు. నిజాయితీకి, విలువలతో కూడిన బీజేపీకి పట్టం కట్టాలని ఆయన కోరారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం అంటే చాలా మందికి అపోహలున్నాయని, కాని ఇక్కడ సమస్యలు అనేకం ఉన్నాయన్నారు. ఇక్కడి ప్రజలు బాగుపడాలన్నా, సమస్యలు తీరాలన్నా బీజేపీ ద్వారానే సాధ్యమవన్నారు. బీఆర్ఎస్‌లో మున్సిపల్ శాఖ మంత్రిగా కేటీఆర్, కాంగ్రెస్ పాలనలో సీఎం వద్ద మున్సిపల్ శాఖ ఉన్నా జూబ్లీహిల్స్ నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ఈ నెల 28న జాతీయ, రాష్ట్ర స్థాయి నాయకులంతా కలిసి దాదాపు 60 కేంద్రాలలో జాతీయ, రాష్ట్ర నాయకులు, కార్యకర్తలు అంతా కలిసి ప్రతి ఇంటికి వెళ్లి ఓటరును ఓటు అభ్యర్థిస్తామని అన్నారు. నవంబరు 9 వరకు ఆయా నాయకులు, కార్యకర్తలు ఇక్కడే ఉండి ప్రచారంలో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు సంగప్ప, తాడూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జూపార్కులోని జంతువులను దత్తత తీసుకున్న బ్లూ యండర్ కంపెనీ

జూపార్క్ డైరెక్టర్ డాక్టర్.సునీల్ ఎస్.హీరామత్‌కు చెక్కును అందజేస్తున్న బ్లూ యండర్ కంపెనీ ప్రతినిధులు

చార్మినార్,అక్టోబరు 25 ప్రభాతవార్త : హైదరాబాద్ పాతబస్తీ బహదూర్‌పుర శివారులో ఉన్న నెహ్రూ జూలాజికల్ పార్కుకు చెందిన రెండు సింహాలు,రెండు పులులు,ఒక చిరుత పులి,ఒక కోతిని ఏడు నెలలు పాటు బ్లూ యండర్ కంపెనీ దత్తత తీసుకుంది.బ్లూ యండర్ కంపెనీ ప్రతినిధులు శనివారం జూపార్కును సందర్శించారు.జూపార్కులో జరిగిన కార్యక్రమంలో రెండు సింహాలు,రెండు పులులు,ఒక చిరుత పులి,ఒక కోతితో పాటు ఇతర జంతువులకు ఏడు నెలల ఆహారం కోసం 14 లక్షల యాభై వేల రూపాయల చెక్కును జూ పార్క్ డైరెక్టర్ డాక్టర్. సునీల్ ఎస్.హీరామత్,జూపార్కు క్యూరేటర్ జె.వసంతకు బ్లూ యండర్ కంపెనీ ప్రతినిధులు అందజేశారు.ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

ముఖం చూసి మోసపోవద్దు : సిపి సజ్జనార్

హైదరాబాద్, అక్టోబరు 25 ప్రభాతవార్త

సైబర్ నేరాల పట్ల మరోసారి ప్రజలను హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ అప్రమత్తం చేశారు. ముఖం చూసి మోసపోవద్దు.. జాగ్రత్త అని సీపీ హెచ్చరించారు. వాట్సాప్ లో డీపీగా తన ఫోటోను పెట్టుకుని తెలిసిన వాళ్లకు సందేశాలు పంపిస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని సీపీ పేర్కొన్నారు.ఇవి నకిలీ ఖాతాలు. పూర్తిగా మోసపూరితమైనవి అని తెలిపారు. ఇలాంటి సందేశాలకు స్పందించకండి. ఆ నంబర్లను వెంటనే బ్లాక్ చేసి రిపోర్ట్ చేయండి అని సజ్జనార్ సూచించారు.సైబర్ నేరగాళ్లకు మీ వ్యక్తిగత వివరాలను అసలే ఇవ్వొద్దు. డబ్బులు అడిగితే పంపించొద్దు. సైబర్ మోసగాళ్లకు మీ జాగ్రత్తే అడ్డుకట్టనే విషయం మరచిపోవద్దు. నకిలీ వాట్సాప్ ఖాతాలు మీ దృష్టికి వస్తే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930 కు కాల్ చేసి సమాచారం ఇవ్వండి. అలాగే జాతీయ సైబర్ క్రైమ్ పోర్టల్ లో ఫిర్యాదు చేయండి అని హైదరాబాద్ సీపీ సజ్జనార్ సూచించారు.

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి

రామారావునగర్‌లో నాగుల చవితి సందర్భంగా పూజలు నిర్వహిస్తున్న స్థానికులు.

యూసుఫ్‌గూడ, అక్టోబర్ 25, ప్రభాతవార్త : నాగుల చవితిని పురస్కరించుకుని శనివారం ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో మహిళలు భక్తులు వి రా మారావు నగర్‌లోని శ్రీ విజ్ఞేశ్వర శివపార్వతులు ప్రసన్నాంజనేయ నవగ్రహ నాగదేవత దేవాలయంలో పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు పి శుభాష్‌రెడ్డి, చైర్మన్ పి.శివయ్య, ప్రధాన కార్యదర్శి బి యాదగిరి, కోశాధికారి కె బాలయ్య, ఉపాధ్యక్షులు బి.సాంబశివ, అడ్వైజర్‌లు నాగుల సత్యం, ఎన్.నంరినసంహ, సతీష్‌రెడ్డి, కాలనీ అధ్యక్షులు ఎస్‌రాజు చారి, చైర్మన్ ఆవుల సంజీవ, ప్రధాన కార్యదర్శి యశ్వంత్, తదితరులు పాల్గొన్నారు.

మూసాపేట్ గూడ్స్ షెడ్ రోడ్డులో భారీ అగ్నిప్రమాదం



మూసాపేట్ గూడ్స్ షెడ్ రోడ్డులో అగ్ని ప్రమాదం చోటుచేసుకోవడం కమ్ముకున్న పొగ

కెపిహెచ్‌బి కాలనీ, అక్టోబర్ 25, ప్రభాతవార్త

కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని మూసాపేట్ గూడ్స్ షెడ్ రోడ్డులో శనివారం ఉదయం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. మూసాపేటలోని ఇండియన్ కంటైనర్ కార్పొరేషన్ డిపోలోనీ గోడౌన్ నంబరు 6,7,8 లలో ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. గోడౌన్లలో నిలువ ఉంచిన కెమికల్ డ్రమ్ములతోపాటు మరోచోట ఉంచిన వైన్ బాటిల్స్‌కి నిప్పు తగలడంతో మంటలు రెట్టింపు అయ్యాయి. ఈ సంఘటన జరిగిన సమయంలో స్థానిక ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అధికారులు 6 ఫైరింజనుల సహాయంతో అగ్నిమాపక సిబ్బంది, డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ అధికారులు మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. మూడు గోడౌన్లలో మంటలు వ్యాపించడంతో పెద్ద ఎత్తున ఆస్తి నష్టం జరిగినట్లు తెలుస్తోంది. ఈ మేరకు కూకట్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

భవన్స్ ఆత్మకూరి రామారావు పాఠశాలలో 'ఉడాన్' వేడుకలు

ఉడాన్ వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

జూబ్లీహిల్స్, అక్టోబరు 25, ప్రభాతవార్తః జూబ్లీహిల్స్‌లోని భారతీయ విద్యాభవన్స్ పబ్లిక్ స్కూల్ ఆత్మకూరి రామారావు పాఠశాలలో శనివారం ఉడాన్ వేడుకలను నిర్వహించారు. లివ్ ఇన్ హార్మోనీ, రూల్ ఆఫ్ ది జంగిల్ పేరుతో ఈ వేడుకలను నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థుల సంస్కృతిక ప్రదర్శనుల విశేషంగా ఆకట్టుకున్నాయి. తొండి గణపతి పాట, జంగిల్ జంగిల్ పతా చలా హై అంటూ నృత్యాలు చేసి చిన్నారులు ఆకట్టుకున్నారు. స్నేహం, ఐక్యతలను వివిధ పద్ధతుల ద్వారా విద్యార్థులు ఇక్కడ ప్రదర్శించారు. జంతువుల ఆత్మకథ, స్నేహమే జీవితం, అవని-ది టైగర్ పేరుతో మూడు భాషల్లో రూపకల్పన చేసిన కార్యక్రమం ఆహూతులను ఆకట్టుకుంది. నెమలి నృత్యం, గిరిజన నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థుల్లో దాగి ఉండే సృజనాత్మకతను, కళలన బయటకు తీసేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటుచేసినట్లు పాఠశాల ప్రిన్సిపల్ శ్రీలతా నాయర్ తెలిపారు. కార్యక్రమంలో ఎంవీ రాంమోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ పాండేషన్ ట్రస్ట్ ఇంటర్నేషనల్ సేవలు ఎంతో గొప్పవి

వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లింగా ప్రకాష్

విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగి ఎం.అశోక్ ను సత్కరిస్తున్న వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లింగా ప్రకాష్, రామలింగేశ్వర రావు, నిరంజన్ రెడ్డి తదితరులు

చిక్కడపల్లి అక్టోబర్ 25 ప్రభాతవార్త: వాకర్స్ పాండేషన్ ట్రస్ట్ ఇంటర్నేషనల్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా విపత్తు సమయాలలో విరాళాలిచ్చి ఆదుకుంటున్న వారిని గుర్తించి గౌరవించడం మంచి సంప్రదాయమని వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లింగా ప్రకాష్ అన్నారు. శనివారం బాగ్ లింగంపల్లి సుందరయ్య పార్క్ లో వాకర్స్ ఇంటర్నేషనల్ మహాత్మా గాంధీ ఫెలోషిప్ సభ్యత్వం కింద రూ. 10 వేలు చెల్లించి సభ్యత్వం తీసుకుని, సేవా సభ్యులుగా కొనసాగుతున్న విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగి ఎం.అశోక్ సత్కరించి అభినందించే కార్యక్రమ రామలింగేశ్వర రావు ఆధ్వర్యంలో జరిగింది. ట్రస్ట్ కార్యవర్గ సభ్యుల సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ అఫ్ హైదరాబాద్ సెంట్రల్ అధ్యక్షుడు పివి.నిరంజన్ రెడ్డి, డిస్ట్రిక్ట్ గవర్నర్ లింగా ప్రకాశం, చీఫ్ అడ్వైసర్, పిఆర్ఓ రామలింగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్ అఫ్ హైదరాబాద్ సెంట్రల్ వార్షిక నివేదిక అందజేత

వాకర్స్ క్లబ్ అఫ్ హైదరాబాద్ సెంట్రల్ వార్షిక నివేదికను గవర్నర్ లింగా ప్రకాష్‌కు అందజేస్తున్న క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పివి.నిరంజన్ రెడ్డి, ఎస్.మనోహర్ రెడ్డి

చిక్కడపల్లి అక్టోబర్ 25 ప్రభాతవార్త: వాకర్స్ క్లబ్ అఫ్ హైదరాబాద్ సెంట్రల్ నిర్వహించిన కార్యక్రమాలకు సంబంధించిన నివేదికను అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పివి.నిరంజన్ రెడ్డి, ఎస్.మనోహర్ రెడ్డి వాకర్స్ ఇంటర్నేషనల్ గవర్నర్ లింగా ప్రకాష్ కు అందించారు. శనివారం బాగ్ లింగంపల్లి సుందరయ్య పార్క్ లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో నివేదికను అందించారు. ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ సంవత్సర కాలంగా తమకు కార్యక్రమాల నిర్వహణకు సంపూర్ణ సహకారాన్ని అందించిన వారందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఎస్.మురళి కృష్ణ, పూర్వ ఏరియా వైస్ ప్రెసిడెంట్ సంపత్ రెడ్డి, దామోదర్ రెడ్డి, గందాధర్, శైలజ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్మెంట్ ఉద్యోగులకు బెనిఫిట్స్ చెల్లించాలి

-11న పెన్షనర్ల జెఎసి ధర్నా

సెక్రటేరియట్ వద్ద మాట్లాడుతున్న చైర్మన్ లక్ష్మయ్య,సత్యనారాయణ తదితరులు

హైదరాబాద్, అక్టోబరు 25,ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్ల సమస్యలు పరిష్కరించకుంటే నవంబర్ 11న ధర్నా నిర్వహిస్తామని తెలంగాణ ప్రభుత్వ పెన్షన్‌దారుల జెఏసీ ప్రకటించింది. ఈమేరకు శుక్రవారం సెక్రటేరియట్ వద్ద చైర్మన్ కె.లక్ష్మయ్య మీడియాతో మాట్లాడుతూ ఏప్రిల్ 2024 నుండి పదవీ విరమణ చేసిన పెన్షనర్లకు వారికి రావలసిన పెన్షనరీ బెనిఫిట్స్ సకాలంలో రాక అప్పు లు కట్టలేక, పిల్లల పెళ్ళిళ్ళు, చదువులు అగిపోయి అవమాన భారంతో కొందరు ఆత్మహత్యలు చేసుకుంటుండగా మరికొందరు వృద్ధాప్యంలో అనేక రకాల రుగ్మతలతో ఇబ్బందిపడుతున్నారన్నారు. ఇవన్నింటికి ప్రభుత్వం సకాలంలో పెన్షనరీ బెనిఫిట్స్ 20 నెలలుగా చెల్లించకపోవటమే కారణమని ఇవి ప్రభుత్వ హత్యలని భావిస్తున్నామన్నారు. కావున ప్రభుత్వం ప్రభుత్వం స్పందించి పదవీ విరమణ చేసిన పెన్షనర్లందరికి వారికి రావలసిన పెన్షనరీ బెనిఫిట్స్ (జి.పి.యఫ్, జి.ఎల్.ఐ., గ్రాట్యుటీ, కమ్యుటేషన్ మరియు లీవ్ ఎస్ క్యాష్మెంట్ మొదలగునవి నవంబర్ 10లోగా చెల్లించాలని లేనిపక్షంలో నవంబర్11న ఇందిరాపార్కు వద్ద బాధిత పెన్షనర్ల కుటుంబ సభ్యులతో కలిసి "ధర్నా" నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈసమావేశంలో సెక్రటరీ జనరల్ తులసి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

జంటనగరాల బాలబాలికలకు వివిధ అంశాలపై ప్రతిభాపాటవ పోటీలు

చిక్కడపల్లి, అక్టోబరు 25 ప్రభాతవార్త: బాలానందంట్రస్ట్ ఆధ్వర్యంలో 86 వార్షికోత్సవం సందర్భంగా నవంబరు 9వ తేదీ నుంచి జంటనగరాల బాలబాలికలకు వివిధ అంశాలపై ప్రతిభాపాటవ పోటలు నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ వివరించింది. నారాయణగూడలోని ట్రస్ట్ ఆవరణలో జరిగే ఈ కార్యక్రమాలకు సంబంధించి ఇతర వివరాలకు 8121023248 ద్వారా ఇతర వివరాలు పొందవచ్చన్నారు. నర్సరీ నుంచి 9వ తరగతి చదువుతున్న బాలబాలికలు ఈ పోటీలలో పాల్గొనడానికి అర్హులు అని అన్నారు. నర్సరీ రైమ్స్(తెలుగు), నీతిపద్యాలు, భక్తిగీతాలు, లలిత గీతాలు, సినిమా పాటలు, కర్ణాటక సంగీతం, రామదాసు కీర్తనలు, అన్నమాచార్య కీర్తనలు, చిత్రలేఖనం, కూచిపూడి, భరతనాట్యం, భక్తిగీతాలు తదితర అంశాలలో పోటీలుంటాయన్నారు. ఈ పోటీలలో గెలుపొందిన వారికి త్వరలో జరగబోయే వార్షికోత్సవం సందర్భంగా బహుమతులు అందజేస్తారు.

ఆత్మీయతకు అనుబంధానికి ప్రతీక భారతీయ సంస్కృతి : సిరికొండ మధుసూదనాచారి

రవీంద్రభారతి, అక్టోబరు 25 ప్రభాతవార్త : భారతీయ సంస్కృతి అంటే ఆత్మీయతకు, అనుబంధానికి ప్రతిరూపమైన సంప్రదాయమన్న తెలంగాణ తొలి శాసనసభ సభాపతి, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి, సమాజంలో మారుతున్న స్థితిగతులనే కాకుండా సదాచారాలను సత్ సంప్రదాయాలు, భారతీయ సంస్కృతి, ఆచార వ్యవహారాలు, మన కళలు, కట్టు బొట్టులను ముందుకు తీసుకువెళ్లాల్సిన బాధ్యత ప్రభుత్వం, సాంస్కృతిక సంస్థలతోపాటు మనందరిపైనా ఉందని అన్నారు. ప్రముఖ సాంస్కృతిక, సామాజిక స్వచ్ఛంద సేవాసంస్థ ఉజ్వల ఆధ్వర్యంలో సంస్థ 8వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని రవీంద్రభారతి ప్రధాన మందిరంలో ఆల్ఇండియా కల్చరల్ అండ్ డాన్స్ ఫెస్ట్ శోభాయమానంగా నిర్వహించారు. సంస్థ అధ్యక్షురాలు ఎం.లక్ష్మి నేతృత్వంలో సీనియర్ పాత్రికేయుడు ఎన్.సత్యనారాయణ యాదవ్ (సతీష్) పర్యవేక్షణలో సరస్వతి ఉపాసకుడు దైవజ్ఞశర్మ సభాధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సిరికొండ మధుసూదనాచారి విశిష్ట అతిథులు

సేవాభారతి పురస్కారాలందజేస్తున్న మధుసూదనాచారి, దైవజ్ఞశర్మ, ఎం.లక్ష్మి, సతీష్, పిఎంకె.గాంధీ తదితర అతిథులు

డా. శివనరసింహన్‌స్వామి, అనిల్‌యాదవ్, టి.సామ్యూల్, బి.సత్యనారాయణ, బ్రహ్మశ్రీ ప్రదీప్‌కుమార్ తంత్రి తదితరులతో కలిసి ఉభయ తెలుగురాష్ట్రాల్లో వివిధరంగాల్లో విశిష్ట సేవలందిస్తున్న 10మంది ప్రముఖులను, ఆరుగురు సుప్రసిద్ధ సంగీత నాట్య గురువులను సత్కరించి సేవాభారతి పురస్కారాలను ప్రదానం చేసి సమాజానికి వారి సేవలను ప్రశంసించారు. సభకుముందు యువకళాకారుల శాస్త్రీయ, సంప్రదాయ నృత్యాలు ఆహూతులను అబ్బురపరిచాయి.

రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ రాజీనామా చేయాలి

ఆప్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ బిడ్డి సుధాకర్

ముషీరాబాద్, అక్టోబర్ 25, ప్రభాతవార్త: కర్నూల్ వద్ద జరిగిన ఘోర బస్సు ప్రమాదానికి బాధ్యత వహిస్తూ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తన పదవికి రాజీనామా చేయాలని ఆప్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ బిడ్డి సుధాకర్ డిమాండ్ చేశారు. శనివారం రాత్రి ట్యాంక్‌బండ్‌పైనున్న అంబేద్కర్ విగ్రహం వద్ద మృతులకు కొవ్వొత్తులతో ఆప్ శ్రేణులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ ట్రావెల్ మాఫియాను ప్రోత్సహిస్తున్నది ప్రభుత్వమేనని ధ్వజమెత్తారు. ప్రైవేట్ ట్రావెల్ బస్సు సర్వీసులను నిషేధించాలని డిమాండ్ చేశారు. లంచాలకు అలవాటుపడి, హైదరాబాద్ నుండి బయలుదేరే ట్రావెల్స్ బస్సుల భద్రతా ప్రమాణాల అమలుపై పర్యవేక్షణ లేకపోవటం ప్రభుత్వ వైఫల్యమేనని అన్నారు. కర్నూల్ ప్రమాదానికి కారణమైన వారితో పాటు వేమూరి కావేరి ట్రావెల్స్ యాజమాన్యంపై

బస్సు ప్రమాద మృతులకు కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న డాక్టర్ బిడ్డి సుధాకర్ తదితరులు

కఠిన చర్యలు తీసుకోవాలని, మృతి చెందిన కుటుంబాలకు కోటి రూపాయల నష్ట పరిహారం ఇప్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆప్ రాష్ట్ర నాయకులు బుర్ర రాముగౌడ్, విజయ్ ముల్లంగి, హేమ జిల్లోజు, జావీద్ షరీఫ్, దర్శనం రమేస్, రమ్యగౌడ్, రాకేష్ సింగ్, అలీ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు,ఫుట్‌పాత్‌లు ఆక్రమిస్తే కఠిన చర్యలు

-నార్త్‌జోన్ ట్రాఫిక్ 1 ఎసిపి శంకరరాజు

భగవంతాపూర్ బస్తీ రోడ్డులో ఫుట్‌పాత్‌పై వెలిసిన డబ్బాల తొలగింపు.

బేగంపేట అక్టోబరు 25,ప్రభాతవార్త వాహనాలు ప్రయాణించే రోడ్లు,ఫుట్‌పాత్‌లు ఆక్రమిస్తే కఠిన చర్యలు చేపడతామని నార్త్‌జోన్ ట్రాఫిక్ 1ఏసీపీ జి.శంకరరాజు హెచ్చరించారు.నార్త్‌జోన్ పరిధిలోనిఅన్ని ప్రాంతాల్లో ఆపరేషన్ రోప్ ను విజయవంతం చేస్తామని ఆయన తెలియజేసారు.ఫుట్‌పాత్‌ల ఆక్రమణ వల్ల 33శాతం పాదచారులు ప్రాణాలు కోల్పోతున్నారని,వారి రక్షణ కోసం ప్రతి ఫుట్‌పాత్‌ను రక్షిస్తామని,వారికి నడిచేందుకు అనుకూలంగా చర్యలు చేపడతామని ఆయన అన్నారు. బేగంపేట విమానాశ్రయం పక్కనే ఉన్న భగవంతాపూర్ బస్తీలో ఫుట్ ఫాత్ ఆక్రమణలను తొలగించామని, బేగంపేటలోని మిగిలిన అన్ని ప్రాంతాల్లోని ఫుట్ ఫాత్ ఆక్రమణలను తొలగించనున్నట్లు ట్రాఫిక్ ఏసీపీ తెలియజేసారు.బేగంపేట ప్రధాన రోడ్డుతో పాటు వివిధ బస్తీల్లో ఆక్రమణ చెరలో ఉన్న ఫుట్‌పాత్‌లను రక్షిస్తామని ఆయన తెలియజేసారు.ఉత్తర మండలం పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లను పాదచారులు నడిచేందుకు వీలుగా అందుబాటులోకి తీసుకువస్తామని ఏసీపీ తెలియజేసారు.

ఎంటిఏఆర్ టెక్నాలజీస్ లిమిటెడ్ కంపెనీ యూనియన్ ఎన్నికల్లో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ విజయం

కూకట్‌పల్లి, అక్టోబర్ 25, ప్రభాతవార్త బాలానగర్ పారిశ్రామికవాడలో ఉన్న ఎంటీఏఆర్ టెక్నాలజీస్ లిమిటెడ్ కంపెనీలో జరిగిన యూనియన్ ఎన్నికల్లో భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ తరపున పోటీ చేసిన మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్ విజయం సాధించారు. శనివారం కంపెనీలో జరిగిన గుర్తింపు యూనియన్ ఎన్నికల్లో వి.శ్రీనివాస్ గౌడ్ పోటీ చేసి సమీప బిఎంఎస్ అభ్యర్థి మెదక్ పార్లమెంటు సభ్యులు రఘునందన్ రావుపై ఆరు ఓట్ల తేడాతో ఘన విజయం సాధించారు. పోటీలో పాల్గొన్న శ్రీనివాస్ గౌడ్‌కు 193 ఓట్లు రాగా, పి రఘునందన్ రావుకు 187 ఓట్లు, అలాగే సిఐటియు అభ్యర్థికి 83 ఓట్లు పోలయ్యాయి. ఈ కార్యక్రమంలో చిట్టి రెడ్డి శ్రీధర్ రెడ్డి, రమేష్ యాదవ్, అక్కిరెడ్డి, మాయ బాల నర్సయ్య, కిరణ్, రాజేష్, సుధాకర్, కిశోర్, ఇతర కార్మిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పేద రోగుల సహాయకులకు అన్నదానం

అన్నదానం చేస్తున్న అసద్,అన్వర్ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్,టిఎన్‌జిఓ కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ఎస్.ఎం.ముజీబ్‌హుస్సేనీ

గన్‌ఫౌండ్రి,అక్టోబర్ 25 ప్రభాతవార్త: అసద్,అన్వర్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వైద్యం కోసం పేద రోగులకు ఉచితంగా అన్నదానం చేశారు.ఎం.ఎన్.జె క్యాన్సర్ ఆసుపత్రి ఆవరణలో సుమారు 400 మంది పేదరోగులకు ట్రస్ట్ చైర్మన్,ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం.ముజీబ్‌హుస్సేనీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలనుంచి పేద రోగులకు ప్రతినెల మూడు వారాలపాటు అన్నదానం చేయడం,ముఖ్యంగా ముజీబ్ తల్లిదండ్రుల పేరిట అన్నదానం చేయడం పట్ల సంతోషదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో టిఎన్‌జిఓ అసోసియేట్ అధ్యక్షులు కె.ఆర్. రాజ్‌కుమార్,ఎం.ఎన్.జె క్యాన్సర్ అధ్యక్షులు బి.శివకుమార్,కార్యదర్శి చంద్రశేఖర్,ఇఎన్‌టి రాజు పాల్గొన్నారు.

సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు నూతన సిఈఓగా బాధ్యతలు స్వీకరించిన అరవింద్ కుమార్ ద్వివేదిని శనివారం బోర్డు మాజీ సభ్యులు జె.ఎం.ఆర్, పాండు యాదవ్, శ్యామ్ నళిని కిరణ్, అనితా ప్రభాకర్‌లు మర్యాదపూర్వకంగా కలిసి శాలు కప్పి పుష్పగుచ్చం అందజేసి అభినందనలు తెలియస్తున్న దృశ్యం

తాతా అర్జున్ పహిల్వాన్ ఆదర్శం

: యువ మల్లయోధుడు ఐతన్ ఆర్యన్ యాదవ్

బంగారు పతకం సాధించిన ఆర్యన్‌యాదవ్‌ను అభినందిస్తున్న దృశ్యం

బేగంబజార్,అక్టోబర్ 25ప్రభాతవార్త: ఇటివల జరిగిన హైదరాబాద్ జిల్లా గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన కుస్తీ పోటిలల్లో గొల్లకిడికి జైభవానినగర్ ప్రాంతానికి చెందిన జై భవాని వ్యాయంశాలకు చెందిన యువ మల్లయోధుడు ఐతన్ ఆర్యన్‌యాదవ్ అండర్19 రాష్ట్ర స్థాయి చాంపియన్ షిప్ పోటిలో తన సమీపం ప్రత్యర్థిపై గెలిచి బంగారు పతకాన్ని సాధించారు.ఈ పోటిలో గెలిచిన యువ మల్లయోధుడు ఐతన్ ఆర్యన్ యాదవ్ మాట్లాడుతూ కుస్తీపోటిలలో రాణించడానికి తన తాత ఐతన్ అర్జున్‌యాదవ్ ఆదర్శమన్నారు.పలువురు మల్లయోధులు ఆర్యన్ యాదవ్‌ను అభినందించారు. జైభవానీ వ్యాయంశాల నిర్వాహకులు మల్లయోధుడు అర్జున్‌యాదవ్,జైహింద్‌యాదవ్,అభిమన్యుయాదవ్‌ల పర్యవేక్షణలో ఎంతో మంది యువకులకు కుస్తీ పోటిలల్లో శిక్షణ ఇస్తుంటారు.నేటి యువత విద్యతోపాటు క్రీడల్లో రాణిస్తే సమాజంలో మంచి గుర్తింపు వస్తుందన్నారు.అందరు గౌరవిస్తారన్నారు.

నిరాకరించిందని నిర్దాక్షణ్యంగా చంపేశాడు

- అసోం యువతిపై హత్యాచారం.. నిందితుడు అరెస్ట్

జూబ్లీహిల్స్, అక్టోబరు 25, ప్రభాతవార్తః లైంగిక చర్యకు నిరాకరించిందని అసోంకు చెందిన ఒక మహిళపై దాడి చేసి అత్యాచారానికి పాల్పడి హత్య చేసిన నిందితుడిని పంజాగుట్ట పోలీసులు అరెస్ట్ చేశారు. పంజాగుట్ట ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ కథనం ప్రకారం.. ఈ నెల 23న బేగంపేటలోని ఇంపీరియల్ హౌజ్ అపార్ట్‌మెంట్స్ ఎదురుగా శ్రీసత్య టిఫిన్ అండ్ మీల్స్ సెంటర్ వద్ద ఒక మహిళ స్పృహ తప్పి పడి ఉండటాన్ని అక్కడే టీ స్టాల్ నిర్వహించే పోతమచెట్టి పండు గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు. లీసా(35)గా పోలీసులు అమెను గుర్తించారు. అప్పటికే ఆమె మృతి చెంది ఉండటంతోపాటు ఆమె శరీరంపై గాయాలుండటం, పక్కనే మద్యం సీసాలు ఉండటంతో హత్య కేసుగా నమోదు చేసి శవపంచానామా నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు దర్యాప్తు చేపట్టిన పంజాగుట్ట పోలీసులు అనంతపురం జిల్లా నల్లచెరువు మండలం ఎనమల్లపల్లి గ్రామానికి చెందిన వై. రెడ్డప్ప(38)గా గుర్తించారు. 22న రాత్రి 11.45 గంటల ప్రాంతంలో గ్రీన్‌ల్యాండ్స్ వద్ద ఒంటరిగా ఉన్న లీసాను పలకరించిన రెడ్డప్ప ఇద్దరు కలిసి సమీపంలోని నిర్జన ప్రాంతానికి వెళ్లి అక్కడ మద్యం సేవించారు. అనంతరం ఆమెతో లైంగిక చర్యకు పాల్పడ్డాడు. మరోసారి ప్రయత్నించగా లీసా నిరాకరించింది. దీంతో కోపోద్రిక్తుడైన రెడ్డప్ప ఆమెపై దాడికి పాల్పడి గొంతు నులిమి అత్యాచారం చేసి అనంతరం ఆమెను హతమార్చి అక్కడి నుంచి పరారైట్లు విచారణలో అంగీకరించాడు. కేసును ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేసిన ఎస్సైలు సురేష్, నరేష్, కానిస్టేబుల్ రవికుమార్, హోంగార్డు ఆనంద్‌లను ఆయన అభినందించారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

నిమ్స్ వైద్యవిద్యార్థినిని వేధిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

జూబ్లీహిల్స్, అక్టోబరు 25, ప్రభాతవార్తః నిమ్స్ ఆసుపత్రిలో పనిచేస్తున్న ఓ వైద్య విద్యార్థినిని వేధిస్తున్న వ్యక్తిపై పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పంజగుట్ట పోలీసుల కథనం ప్రకారం.. నిమ్స్ ఆసుపత్రిలో పీజీ చివరి సంవత్సరం చదువుతున్న ఒక వైద్య విద్యార్థిని(30) ప్రార్థనకు వెళ్లిన సమయంలో ఏసుదాసు ఇమ్మరాజు అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలోనే ఆమె ఫోన్ నంబరు తీసుకున్న ఏసుదాసు ఆమెను ఫోన్‌కాల్స్, అసభ్యకర సందేశాలతో, నిత్యం వెంటపడుతూ వేధిస్తున్నాడు. ఇంటికి వెళ్లినా, ఆసుపత్రికి వెళ్లిన వెంబడిస్తుండటంతో ఆమె కొద్ది రోజుల కిందట కీసర పోలీస్ స్టేషన్లో సైతం ఫిర్యాదు చేసింది. అదేది లెక్కచేయకుండా వెంటపడటంతోపాటు బహుమతులు, ఆహారాన్ని హాస్టల్‌కు, పనిచేసే ప్రాంతానికి పంపుతున్నాడు. ఈ మేరకు వైద్య విద్యార్థిని పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులుకేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మెరుగైన చికిత్సకు ఆదేశం...ఎంతటి ఖర్చైనా వెనకాడేది లేదు

మంత్రి అడ్లూరి లక్ష్మణ్

సికింద్రాబాద్, అక్టోబర్ 25, ప్రభాతవార్త యశోద హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న జగిత్యాల జిల్లా ధరూర్ క్యాంపు హాస్టల్ విద్యార్థి హిమేష్‌ను షెడ్యూలు కులాల అభివృద్ధి శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ శనివారం సాయంత్రం పరామర్శించారు. చికిత్స పొందుతున్న హిమేష్‌కు అందుతున్న వైద్య సేవలు గురించి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఆసుపత్రి వైద్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. హిమేష్‌కు మెరుగైన సేవలు అందించాలని, ఎంతటి ఖర్చైనా భరిస్తామని ఈ సందర్భంగా ఆసుపత్రి యశోద హాస్పిటల్స్ డైరెక్టర్ పవన్ కుమార్ గోరుకంటికి మంత్రి లక్ష్మణ్ తెలిపారు. ఇదిలా ఉండగా పిడుగుపాటుతో తీవ్ర గాయాల పాలైన హిమేష్‌ను మెరుగైన చికిత్స కోసం మంత్రి ఆదేశంతో సికింద్రాబాద్‌లోని యశోద ఆసుపత్రికి తీసుకువచ్చిన విషయం తెలిసిందే. చికిత్స కోసం ఆస్పత్రికి తీసుకువచ్చిన వెంటనే కమిషనర్ ఎన్.క్షితిజ పరామర్శించిన విషయం తెలిసిందే. అత్యవసర చికిత్స నిమిత్తం యాజమాన్యానికి 5 లక్షల రూపాయలను మంజూరు చేసిన విషయం తెలిసిందే. జగిత్యాల జిల్లా

యశోద హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న హిమేష్‌ను పరామర్శించిన సోషల్ వెల్ఫేర్ మంత్రి అడ్లూరి లక్ష్మణ్

ధరూర్ క్యాంపు ఎస్సీ హాస్టల్ విద్యార్థి హిమేష్ పిడుగుపాటు ప్రమాదంలో గాయపడటం బాధాకరమని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. హిమేష్‌కు అండగా ఉంటామని, కలత చెందవద్దని హిమేష్ తల్లిదండ్రులకు మంత్రి లక్ష్మణ్ ధైర్యం చెప్పారు. ఎస్సీడి అడిషనల్ డైరెక్టర్ సి.శ్రీధర్, హైదరాబాద్ డిడి ప్రవీణ్ రెడ్డి, ఏడి శ్రీనివాస్, ఉప్పు సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ రైతుల ప్రభుత్వం : మంత్రులు

యూసుఫ్‌గూడ, అక్టోబర్ 25, ప్రభాతవార్త : కాంగ్రెస్ పార్టీ రైతుల ప్రభుత్వం అనీ ప్రజా సంక్షేమం కోసం ఎన్నో పథకాలు అమలు చేయడం జరిగిందని మంత్రులు పొన్నం ప్రభాకర్ వివేక్ వెంకట స్వాములు అన్నారు. శనివారం జూబ్లిహిల్స్ నియోజక వర్గంలోని ఎర్రగడ్డ రైతు బజారులో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి ఓటు వేసి గెలిపించాలని రైతులను అభ్య ర్థించారు. కూరగాయల ధరలు ఎలా ఉన్నాయి.పంటదిగుబడి ఎలా ఉం ది, లాభాలు ఎలా వస్తున్నాయి, అనీ రైతులతో అప్యాయంగా పలుకరించి వారితో ముచ్చటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ప్రభుత్వం అనీ ఎప్ప టికి రైతులకు అండగా నిలుస్తుందని జూబ్లిహిల్స్ నియోజక వర్గంలో అన్నివ ర్గాల మద్దతు కాంగ్రెస్‌కే ఉందని పేర్కొన్నారు. అదేవిధంగా యూసుఫ్ గూడలో ఇంటింటికి ప్రచారం నిర్వహించి ఓట్లను అభ్యర్థించారు. యూసుఫ్ గూడ ప్రధాన రహదారిలో మంత్రి పొన్నం ప్రభాకర్ ఆటో కార్మికులతో

ఎర్రగడ్డ రైతు బజారులో కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతుగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి.

మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకుని ఆటోను స్వయంగా నడిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఆటో డ్రైవర్లకు సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే శంకరయ్య, శివసేన రెడ్డి, గిరిధర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కళలు పిల్లల సమగ్ర వ్యక్తిత్వవికాసానికి తోడ్పడుతాయి

: ప్రముఖ వాగ్గేయకారుడు డా. శ్రీభాష్యం శ్రవణ్‌కుమార్

సన్మానిత కళాకారులతో శ్రవణ్‌కుమార్, నరసింహాచార్య, సుష్మ తదితర అతిథులు

నాంపల్లి, అక్టోబరు 25 ప్రభాతవార్త : సంగీతం, కళలు, సాంస్కృతిక కార్యకలాపాలు పిల్లల సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి ఎంతగానో తోడ్పడుతాయని ప్రముఖ వాగ్గేయకారుడు డా. శ్రీభాష్యం శ్రవణ్‌కుమార్ అన్నారు. వీటికి వయో పరిమితులు ఉండవని, ఏ వయస్కులకైనా ఒత్తిడిని తగ్గించి మానసిక ప్రశాంతత, మనో ఉల్లాసాన్ని కలుగజేస్తాయని స్పష్టం చేశారు. శ్రీకీర్తనా సంగీత అకాడమీ ఐదవ వార్షికోత్సవ వేడుకలు భారత్ వికాస్ పరిషత్‌లో కన్నులపండువగా జరిగాయి. అకాడమి స్థాపకురాలు, సంగీత గురువు వేదగిరి సుష్మా ఆధ్వర్యంలో విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు వీక్షకులను అబ్బురపరిచి ఆకట్టుకున్నాయి. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన శ్రవణ్‌కుమార్, వి

మాటను నిలబెట్టుకోవడంలో హన్మంత్‌రెడ్డి ముందుంటారు

-అంబేద్కర్ సంఘం నాయకులు

బోరు మోటార్‌ను ప్రారంభించిన అంబేద్కర్ సంఘం నాయకులు

దుండిగల్, అక్టోబర్ 25, ప్రభాతవార్త

ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడంలో హన్మంత్‌రెడ్డి ముందుంటారని అంబేద్కర్ సంఘం నాయకులు అన్నారు. బహదూర్‌పల్లి 14వ వార్డు ఎస్సీ బస్తీలో చాలా రోజుల నుండి నీటి సమస్య ఎదురవుతుండడంతో గత వారం క్రితం నియోజకవర్గ అధ్యక్షులు కోలన్ హనుమంత్ రెడ్డిని బస్తీ వాసుల సంప్రదించి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఆయన సానుకూలంగా స్పందించి అతి త్వరలోనే వాటర్ సమస్య తీరుస్తానని హామీ ఇచ్చారు. హన్మంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం శనివారం నూతన బోరు మోటర్‌ను బిగించేలా సంబంధిత అధికారులతో మాట్లాడి, అంబేద్కర్ సంఘం నాయకులతో బోరు మోటర్‌ను ప్రారంభించేలా కృషి చేశారు. మంచినీటి సమస్యను తీర్చినటువంటి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కోలన్ హనుమంత్ రెడ్డికి, గ్రామ మాజీ సర్పంచ్ మైసిగారి శ్రీనివాస్‌కు స్థానికులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 14వ వార్డు అధ్యక్షులు గుడ్డు రాహుల్, అంబేద్కర్ సంఘం అధ్యక్షులు గుడ్డు నర్సింగరావు, బండ మహేందర్, కొమ్ము బిక్షపతి, బైండ్ల ఈశ్వర్,బండ వెంకటయ్య,దుడ్డు లక్ష్మణ్ పాల్గొన్నారు.

కార్వాన్ అభివృద్ధే లక్ష్యం : స్వామి యాదవ్

హీరానగర్ లో సిసి రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ స్వామి యాదవ్

మెహిదీపట్నం అక్టోబర్ 25, ప్రభాతవార్త :

కార్వాన్ డివిజన్ అభివృద్ధే లక్ష్యంగా పనిచేయడం జరుగుతుందని స్థానిక కార్పొరేటర్ ఎం.స్వామి యాదవ్ తెలిపారు. శనివారం కార్వాన్ డివిజన్ హీరానగర్ లో ఎంఐఎం పార్టీ సీనియర్ నాయకులు, గుడిమల్కాపూర్ డివిజన్ కంటెస్టెడ్ కార్పొరేటర్ గోదా వెంకటేష్ గౌడ్ తో కలిసి పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రామాలయం నుండి ప్రభుత్వ పాఠశాల వరకు నూతనంగా రూ. 30 లక్షల నిధులతో నిర్మిస్తున్న సిసి రోడ్డు పనులను ప్రారంభించిన అనంతరం మాట్లాడారు....కార్వాన్ డివిజన్ లోని బస్తీలు, కాలనీలను అన్ని రంగాలలో అభివృద్ధి చేయడానికి కోట్లాది నిధులను తీసుకురావడం జరుగుతుందని పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే కౌసర్ మోహిద్దీన్ సహకారంతో డివిజన్ అభివృద్ధికి అత్యధికంగా నిధులను తీసుకొచ్చి అభివృద్ధి పనులను చేయడం జరుగుతుందన్నారు. అనంతరం కాలనీ అధ్యక్షులు ఓర్సు వీరస్వామి కార్పొరేటర్ ఎం స్వామి యాదవ్, ఎంఐఎం పార్టీ సీనియర్ నాయకులు గోదా వెంకటేష్ గౌడ్ లకు శాలువాలు కప్పి సన్మానించారు. ఆయన వెంట జిహెచ్ఎంసి ఏ.ఈ శ్రీకాంత్, బస్తీ వాసులు చంద్రశేఖర్, కటికే రాజు, బాలస్వామి, మంగలి శ్రీకాంత్, రవి యాదవ్, సదానంద్, మంగలి నరసింహలు ఉన్నారు.

సత్యాన్వేషి నాటకం గ్రంథావిష్కరణ

రవీంద్రభారతి, అక్టోబరు 25 ప్రభాతవార్త :

బుద్ధపథగామి డి.నటరాజశాస్త్రి విరచించిన గౌతమబుద్ధుడు నవలా స్ఫూర్తితో చిరువేరు రఘురామ్ రచించిన సత్యాన్వేషి నాటకం గ్రంథావిష్కరణ రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో ఆదివారం రాత్రి ఆవిష్కరించబడుతుంది. అవిద్య, కర్మలు, ఇంద్రియవాంఛలు, తృష్ణ మొదలైనవి దుఖానికి హేతువని దుఖనిరోధ మార్గాలను అన్వేషించేందుకు సిద్ధార్థుడు తర్వాతికాలంలో గౌతమబుద్ధుడిగా మారిన చరిత్ర సత్యాలకు ఇది నిదర్శనం. ఆచార్య డిఎస్ఎన్.మూర్తి సభాధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు డా. కె.వి.రమణాచారి హాజరై గ్రంథావిష్కరణ కావించనున్నారు. విశిష్ట అతిథులుగా తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర పర్యాటక సంస్థ ఛైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, బుద్ధవనం ప్రాజెక్టు ప్రత్యేకాధికారి మల్లేపల్లి లక్ష్మయ్య, గౌరవ అతిథులుగా నటరాజశాస్త్ర బుద్ధపథగామి, డా. ఈమని శివనాగిరెడ్డి, డా. పాలకుర్తి మధుసూదనరావులు పాల్గొనుండగా డా. కె.జి.వేణు గ్రంథ సమీక్ష చేస్తారని సంస్థ అధ్యక్షుడు సాధూ శ్యామ్‌ప్రసాద్ మీడియాకు తెలిపారు.

విద్యార్థులతో పోలీసులు సైకిల్ ర్యాలీ

విద్యార్థులకు సూచనలు చేస్తున్న ఇన్స్‌పెక్టర్ ధనుంజయ గౌడ్

నాచారం, అక్టోబర్ 25 ప్రభాతవార్త : పోలీసు సంస్మరణ దినోత్సవం సందర్భంగా నాచారం పోలీసులు విధ్యార్థులతో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్స్‌పెక్టర్ వారికి పోలీసుల విధులు, రక్షణ తధితర అంశాలపై అవగాహణ కల్పించారు. ఈ కార్యక్రమంలో నాచారంలోని అకడమిక్ హైట్స్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బందితో పాటు ఎస్ఐ మైబెల్లి పాల్గొన్నారు.

తార్నాకలో ప్రభుత్వ స్థలాల కబ్జాపై డిప్యూటీ మేయర్ ఆగ్రహం

అధికారులతో మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి

తార్నాక, అక్టోబర్ 25 ప్రభాతవార్త : తార్నాక డివిజన్ పరిధిలోని పలు ప్రభుత్వ స్థలాలపై జరుగుతున్న అక్రమ కబ్జాలపై శనివారం గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి, టిటియుసి రాష్ట్ర అధ్యక్షులు మోతే శోభన్ రెడ్డి కలిసి జీహెచ్ఎంసి అధికారులతో పర్యటించారు. ఈ సందర్భంగా వారు తార్నాకలోని వివిధ ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు. అక్కడ జరుగుతున్న అనధికార నిర్మాణాలు, భూమి ఆక్రమణలను గమనించి, తక్షణ చర్యలు తీసుకోవాలని, అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ప్రభుత్వ ఆస్తులు ప్రజల సొత్తు అని వాటిని ఎవరూ అక్రమంగా ఆక్రమించడానికి వీల్లేదన్నారు. ప్రజల సౌకర్యాల కోసం కేటాయించిన స్థలాలను రక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఆక్రమణలపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. స్థానికులు డిప్యూటీ మేయర్‌ను కలుసుకుని కబ్జాల వల్ల ఎదురవుతున్న సమస్యలను వివరించారు.

30 నుంచి హరిహరుల మహాకోటిదీపోత్సవం

గోడప్రతులను ఆవిష్కరించిన సంస్కృతి నిర్మాణ్ ట్రస్ట్ వ్యవస్థాపకులు దోర్బల గుణకర్‌శర్మ

మహా కోటి దీపోత్సవ గోడప్రతులను ఆవిష్కరిస్తున్న సంస్కృతి నిర్మాణ్ ట్రస్ట్ వ్యవస్థాపకులు దోర్బల గుణకర్‌శర్మ తదితరులు

ముషీరాబాద్, అక్టోబర్ 25, ప్రభాతవార్త: ఈనెల 30 నుంచి పటాన్‌చెరు లోని వాల్యూజోన్ హైపర్ మార్ట్‌కు ఎదురుగా ఉన్న విశాల ప్రాంగణంలో సంస్కృతి నిర్మాణ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో హరి హరుల మహా కోటి దీపోత్సవం నిర్వహిస్తున్నామని నిర్వాహకులు, సంస్కృతి నిర్మాణ్ ట్రస్ట్ వ్యవస్థాపకులు దోర్బల గుణకర్‌శర్మ తెలిపారు. శనివారం బషీర్‌బాగ్‌లోని ఎన్ఎస్ఎస్ మీడియా సెంటర్‌లో మహాకోటి దీపోత్సవానికి సంబంధించిన గోడ ప్రతులను ఆయన ట్రస్ట్ సభ్యులతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గుణకర్‌శర్మ మాట్లాడుతూ ఈనెల 30 నుంచి నవంబర్ 20 వరకు ఎంతో వైభవంగా నిర్వహించబోతున్న మహాకోటి దీపోత్సవంలో సప్త హారతి, మహా హారతి, లింగోద్భవం, లక్షవత్తుల వ్రతం, సత్యనారాయణ స్వామి వ్రతాలు, అఖండ దీపం, కోటి పుష్పార్చన, కోటి బిల్వార్చన, కోటి భస్మార్చన, కోటి రుద్రాక్షార్చన వంటి విశేషమైన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. 21రోజుల పాటు నిర్వహిస్తున్న ఈ మహాకోటి దీపోత్సవం ప్రతి రోజూ సాయంత్రం 4.30 నిమిషాల నుండి రాత్రి 10 గంటల వరకు కొనసాగుతుందని, ఈ ఉత్సవానికి వచ్చే భక్తులకు ఉచిత ప్రవేశం ఉంటుందని, ప్రతి రోజూ సాంస్కృతిక కార్యక్రమాలు, ఆధ్యాత్మిక వేత్తల ప్రవచనాలు, నిత్యం ప్రసాద వితరణ ఉంటుందని వివరించారు. ఈ మహాకోటి దీపోత్సవంకు ప్రజా ప్రతినిధులు, అధికారులు, వివిధ రంగాల ప్రముఖులు హాజరవుతారని, పేరూరు శ్రీ సరస్వతి దేవాలయ వ్యవస్థాపకులు బ్రహ్మశ్రీ దోర్బల రాజమౌళి శర్మ దివ్యాశీస్సులతో ఎంతో వైభవంగా నిర్వహించబోయే ఈ మహాకోటి దీపోత్సవంలో భక్తులందరూ పాల్గొని హరిహరుల కృపకు పాత్రులు కావాలని కోరారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో సంస్కృతి నిర్మాణ్ ట్రస్ట్ సభ్యులు దోర్బల సదానంద్‌శర్మ, కొత్త వినయ్‌గుప్తా, శ్రీధర్, ప్రశాంత్ పుటపర్తి, ప్రవీణ్ పన్నాల, నాగేందర్‌సింగ్, షన్ను పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కరించకుంటే సమ్మె బాట

-ప్రభుత్వం సానుకూలంగా ఉన్నా... యాజమాన్యాలు పట్టించుకోవట్లేదు

-1104 యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సాయిబాబా

రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న సాయిబాబా తదితరులు

హైదరాబాద్, అక్టోబర్ 25, ప్రభాతవార్త: విద్యుత్ ఉద్యోగులు నిత్యం వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నారని...విద్యుత్ ఉద్యోగులు, కార్మికుల సమస్యల పట్ల ప్రభుత్వం సానుకూలంగా ఉన్నా యాజమాన్యాలు నిరక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని 1104 విద్యుత్ ఉద్యోగుల సంఘం తీవ్రంగా విమర్శించింది. దీర్ఘకాలిక సమస్యలైన ఆర్టీజన్ ఉద్యోగులకు పదోన్నతులతో పాటు... ఆర్టీజన్లు ప్రమాదాల బారిన పడి గాయపడినప్పుడు వారి కుటుంబాలకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి సాయిబాబు డిమాండ్ చేశారు. ఆర్టిజన్లకు కనీసం సెలవులు ఇవ్వకుండా పనిచేయుస్తూ వెట్టిచాకిరి చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం మింట్ కాంపౌండ్ లోని యూనియన్ రాష్ట్ర కార్యాలయంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వేమునూరి వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఏర్పాటు చేసిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన ప్రసంగించారు. కార్మికులు, ఆర్టీజన్లు, అన్ మ్యాన్డ్ కార్మికులు ఎదుర్కొంటున్న అతి ముఖ్యమైన సమస్యలను ప్రాంతీయ అధ్యక్ష కార్యదర్శులు సమావేశంలో కేంద్ర కార్యవర్గం దృష్టికి తీసుకువచ్చారు. సమస్యల పరిష్కారానికి కార్యాచరణ చేపడతామని తెలిపారు. ఇప్పటికే దీర్ఘకాలిక సమస్యలపై యాజమాన్యాలకు, రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయామని... విద్యుత్ శాఖ మంత్రి స్పందించడంతో ట్రాన్స్ కో యాజమాన్యంతో చర్చలు జరిపినట్లు తెలిపారు. అయితే అంగీకరించిన సమస్యల పరిష్కారం పై ఉత్తర్వులు మాత్రం వెలువడ లేదన్నారు. ఉద్యోగులు, కార్మికుల సమస్యల పట్ల ఇప్పటికే చాలాకాలంగా వేచి ఉన్నామని... ఇక ఆగే పరిస్థితి లేదని ఆయన స్పష్టం చేశారు. సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేయడం మినహా వేరే మార్గం లేదని తెలిపారు. రాష్ట్రంలో విద్యుత్ సిబ్బందికి మోయలేనంత పని భారం పెరిగిపోయిందని... పని భారం తగ్గించేలా వెంటనే ఖాళీగా ఉన్న 3 వేల పోస్టులతో పాటు సుమారు పదివేల అదనపు పోస్టులు భర్తీ చేయాలని ఆయన కోరారు. ఉద్యోగులకు పదోన్నతుల ప్రక్రియ వెంటనే ప్రారంభించాలన్నారు. పాత పెన్షన్ విధానాన్ని తిరిగి తీసుకురావాలని కోరారు. సమస్యల పరిష్కారంలో ఇదే వైఖరి కొనసాగితే... యూనియన్ కేంద్ర కార్యవర్గ తీర్మానం మేరకు సమ్మె చేసేందుకు వెనకాడేది లేదని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో కార్యనిర్వాహక అధ్యక్షులు రాజేందర్, అదనపు ప్రధాన కార్యదర్శి వరప్రసాద్, సలహాదారు ఆర్ జనార్దన్ రెడ్డి, డిస్కం, ట్రాన్స్ కో, జెన్‌కో ప్రాంతీయ అధ్యక్ష కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో నార్సింగిని అగ్రస్థానంలో నిలుపుతాం

- రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

- రూ.9.5.కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభం

నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో రూ.9.5కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభించిన రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్.

నార్సింగి, అక్టోబర్ 25 ప్రభాతవార్త : నార్సింగి మున్సిపాలిటీని అభివృద్ధిలో రంగారెడ్డి జిల్లాలోనే అగ్రస్థానంలో నిలుపుతున్నామని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ పేర్కొన్నారు. శనివారం నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని మంచిరేవుల, నార్సింగి గ్రామాలలో రూ.9.5కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ప్రారంభించి, మరికొన్ని పనులకు శంఖుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ రాజధాని హైదరాబాద్ మహానగరానికి ఢీటుగా నార్సింగిలో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. ఎన్నికల వేళ ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని చేతల్లో చేసి చూపిస్తున్నామన్నారు. స్థానిక నాయకులు నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ వారి ఇబ్బందులు తెలుసుకొని, నా దృష్టికి, మున్సిపల్ కమీషనర్ల దృష్టికి తీసుకెళ్తున్నారని, వెంటనే ఆయా సమస్యల పరిష్కారం కోసం పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేయించి అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. మంచిరేవులలోని గ్రీన్‌ల్యాండ్‌లో రూ.2.10.కోట్లతో సీసీ రోడ్డు పనులకు శంఖుస్థాపన, రూ.65.లక్షలతో బిటి రోడ్డు, రూ.4.5కోట్లతో మల్టీ పర్పస్ కమ్యూనిటీహాల్‌ను ప్రారంభించారు. అలాగే 2.3.కోట్లతో సీఈస రోడ్డు పనలకు శంఖుస్థాపనలు కమీషనర్ కృష్ణమోహన్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్ ముదిరాజ్, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ వేణుగౌడ్, మాజీ వైస్ ఎంపిపి పాపిరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ నాగపూర్ణ శ్రీనివాస్, మాజీ వైస్ ఛైర్మన్ వెంకటేష్ యాదవ్, కాంగ్రెస్ అధ్యక్షులు క్యాతం అశోక్ యాదవ్, మాజీ కౌన్సిలర్లు ఉపారాణి, లక్ష్మీ ప్రవళిక, మాజీ ఎంపిటిసి పీసరి ఈశ్వరయ్య, వినోద్, కిరణ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల్లో భక్తిభావం పెంపొందించేందుకు అధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించాలి

కార్యక్రమంలో పాల్గొన్న పుష్పగిరి మహాసంస్థాన్ పీఠాధిపతి అభినవోద్ధండ విద్యాశంకర భారతీ మహాస్వామి

సికింద్రాబాద్, అక్టోబర్ 25 ప్రభాతవార్త: ప్రజల్లో భక్తిభావం పెంపొందించేందుకు తరుచు అధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించాలని పుష్పగిరి మహాసంస్థాన్ పీఠాధిపతి అభినవోద్ధండ విద్యాశంకర భారతీ మహాస్వామి అన్నారు. సికింద్రాబాద్ శ్రీనివాస నగర్ శ్రీగిరి పద్మావతి గోదా సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో జీర్ణోద్ధరణ పూర్వక మహాసంప్రోక్షణ మహాకుంభాభిషేకంలో భాగంగా శనివారం నిర్వహించిన వాస్తు శాంతి, పర్యగ్నీకరణ తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై అనుగ్రహభాషణం చేశారు. ప్రజల్లో భక్తిభావం పెరిగితే సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వాలు వెల్లివిరుస్తాయని, నిత్య వేదపారాయణంతో అంతరాత్మ పరిశుద్ధం అవుతుందని ఉద్భోదించారు. అనంతరం వేదపండితుల నేతృత్వంలో యాగశాల, ద్వారతోరణధ్వజ, అర్చన, అగ్నిప్రతిష్ట, పూర్ణాహుతి, విష్ణుసహస్రనామార్చన, వేద పారాయణం తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. 26వ తేది ఆదివారం బింబపరీక్ష శాంతిహోమం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ రాజేష్‌కుమార్, కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు బసవరాజు శ్రీనివాస్, తమ్మన వేణుగోపాలరావులు తెలిపారు.

ఆటో డ్రైవర్ దారుణ హత్య

అత్తాపూర్ అక్టోబరు25, ప్రభాతవార్త :

గుంటల్‌షా బాబా దర్గా వెనుక ఓ ఆటో డ్రైవర్‌ను హత్య చేసిన ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది.పోలీసులు వివరాల ప్రకారం.... ఆటో డ్రైవర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దారుణంగా హతమార్చారని అర్ధరాత్రి సమయంలో జరిగిన ఈ ఘటనలో ఆటో డ్రైవర్ ఆప్రోజ్ అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు.మృతుడుకి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. సమాచారం అందుకున్న మైలర్ దేవ్ పల్లి పోలీసులు తక్షణమే సంఘటన స్థలానికి చేరుకుని, హత్య జరిగిన ప్రదేశాన్ని పరిశీలించి హత్యకు ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకుని విచారణ చేపట్టినట్లు తెలిపారు. హత్య వెనుక కారణాలపై పోలీసులు పలు కోణాల్లో విచారణ జరుపుతున్నారు. ఆటో డ్రైవర్ హత్యతో ఆ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది.

కంటోన్మెంట్ బోర్డు నూతన సిఈఓకు అభినందనలు తెలిపిన బానుక నర్మద

కంటోన్మెంట్,అక్టోబర్ 25 ప్రభాతవార్త: సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు నూతన సిఈఓగా బాధ్యతలు స్వీకరించిన అరవింద్ కుమార్ ద్వివేదిని కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ మెంబర్ బానుక నర్మద మల్లికార్జున్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా బోర్డు పరిధిలోని వివిధ ప్రాంతాల్లో నెలకొన్న రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు వంటి సమస్యలు ఆయన దృష్టికి తెచ్చారు. మౌళిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సిఈఓ దృష్టికి తెచ్చినట్లు ఆమె తెలిపారు.

27న రక్తదాన శిబిరం : డిసిపి

కంటోన్మెంట్,అక్టోబర్ 25 ప్రభాతవార్త: పోలీస్ అమర వీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉత్తర మండలం డిసిపి రష్మిపెరుమాల్ ఆధ్వర్యంలో ఈ నెల 27వ తేదీన వెస్ట్ మారేడ్‌పల్లిలోని పద్మశాలి కళ్యాణ మండపంలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు డిసిపి ఓ ప్రకటనలో తెలిపారు.

తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
GHMC

నిట్ నం. 38, పని పేరు: GHMC, రాజేంద్రనగర్ సర్కిల్-11లో పాడైన BT ప్యాచ్‌లు వేయుట యొక్క 1 సం. పని కొరకు. అంచనా మొత్తం / ECV: రూ.50.00 లక్షలు. డౌన్‌లోడింగ్ ప్రారంభ తేదీ & సమయం: తేది: 27.10.2025 మ.2.30 గం. వద్ద. బిడ్ స్వీకరణకు చివరి తేదీ & సమయం: తేది: 04.11.2025 మ.2.45 గం. వద్ద. EE/SE యొక్క పేరు & చిరునామా: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, రాజేంద్రనగర్, డివిజన్ నం.11, GHMC, సెల్ నం: 9989930608. ఇ-మెయిల్ id: eec11.ghmc2@gmail.com సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-XI, (RJNR), GHMC
DIPR.No.9729-PP/CL/Advt/1/2025-26, తేది: 25.10.2025

PUBLIC NOTICE

Notice is hereby given that Our Clients are in the process of finalizing the purchase of the following immovable property:

Property Description: Land admeasuring 292.5 Sq.yds. at Sy.No.403/1, Plot No. A-84, Journalist Colony, Jubilee Hills, Hyderabad, Telangana (Layout-52/8/83).

Boundaries of the Site:
- North: 50 ft Road
- South: Plot No. 91
- East: Plot No. 85
- West: Plot No. 83

The property is being purchased from Mr. Pendyala Venkata Sita Rama Seshadri Sarma, (S/o Mr. Lakshmi narasimha Sastry), Mr. Phani Kumar Mokarla (S/o Mr. Ratnam Venkata Mokarla), Smt. Pendyala Annapurna Vishalakshmi, (W/o Mr. Ratnam Venkata Mokarla), and Smt. JNS Kiranmai (W/o Jallepally Venkata Narsimha Dattu) who claim to hold valid and marketable title.

This notice invites any person, institution, bank, financial institution, firm, or company having or claiming any right, title, interest, lien, charge, mortgage, lease, encumbrance, easement, injunction, lis pendens, prior agreement, or any claim whatsoever over the said property to notify the undersigned in writing within **5 (five) days** from the date of this publication, along with certified copies of supporting documents.

Failure to respond within this period shall be deemed a waiver of all such claims, and the transaction will proceed on the presumption that the property is free from any encumbrances or third-party interests. My client shall not be responsible for any claims arising thereafter.

This notice is issued solely to ensure a clear and marketable title and does not constitute an admission of any claim or interest.

Sd/- Shraddha Gupta
Advocate
The Law Chambers
Suit 4A, A Block, Silver Cloud Complex, Raidurg, LIG Chitrapuri Colony, Hyderabad, Telangana-500104. Ph: 9885885705
Email: shraddha@thelawchambers.in

IN THE COURT OF II ADDL. DISTRICT AND SESSIONS JUDGE CUM PRINCIPAL FAMILY COURT, MEDCHAL-MALKAJGIRI DISTRICT, AT : KUKATPALLY
E.P.No. 1243 of 2022

BETWEEN :
M. Surya Prakash ...Petitioner
AND
Gangireddy Srin Vasulu Reddy & ors ...Respondent

1. Gangireddy Srin Vasulu Reddy, S/o. Adinarayana Reddy, R/o. Balaji Nagar, Kukatpally,
Also at: HIG, A-6, A.P. Housing Board Colont, Gachibowli, Ranga reddy District.
Also at: 2-22-122A, Plot no. 47, KRA Nagar, Vijaya Nagar, Bhagya Nagar Colony, Hyd - 500072.
Also at: 7-83, Lolla Vari Street, Vtc, Kollur, Guntur, Andhra Pradesh - 522324

Take notice that the present E.P. is posted on **30.10.2025** for your appearance and counter, if any. Hence, you are required to appear either in person or through your counsel, failing which the matter might be decided in your absence.

//BY THE ORDER OF THE COURT//
Sd/- M/S. Sharad Sanghi & Associates,
Advocates,
Email :-sanghisharad@gmail.com

IN THE COURT OF THE HON'BLE III ADDL. JUNIOR CIVIL JUDGE, MEDCHAL-MALKAJGIRI DISTRICT, AT: MEDCHAL
O.S.No. 783 of 2025

Between
Smt Mudadla Lakshmi & Others ...Plaintiffs
AND
Ramba Hemanth Kumar & another ...Defendants

NOTICE

To
To whomsoever it may concerned. ...Defendant No.2

Please take notice that the above named Plaintiff filed a suit for declaration of their Status with the deceased Late Mudadla Yellam Naidu, son of Chinappala Swamy Naidu and declaration of title and injunction in respect of house premises bearing Door No. 6-292/ B, on a total land admeasuring 100 square yards, comprising Plot Nos. 49/part and 50/part in Survey Nos. 20, 23 to 27 part, situated at Venkateswara Nagar, Chintal, Quthbullapur Village and Mandal, then part of Ranga Reddy District, presently under presently under Medchal-Malkajgiri District against Sri. Ramba Hemanth Kumar, S/o. Ramba Sivvam Naidu and another (including you). The plaintiffs herein also filed an application under Order 39 Rule 1 & 2 in respect of same property for ad-interim injunction. The above said Suit proceedings are posted on **17-12-2025 at 10:30 AM** for your appearance and objections, if any. Therefore, I, hereby requested you to appear in O.S.No.783 of 2025 proceedings pending on the file of Hon'ble III Addl. Junior Civil Judge, Medchal-Malkajgin District at Medchal either in person or through an advocate on **17-12-2025 at 10.30 A.M.,** before the above Hon'ble Court otherwise the matter will be decided in your absence as per law.

//BY ORDER OF HON'BLE COURT//
Sd/- PUSHADAPU SUBBA RAO
Advocate
H.No.5-270/2, Chandra Nagar, Chinthal, Hyderabad-500 054. Cell: 94403 46561

పార్కులను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాం: అబ్రార్

ఫరత్ నగర్ పార్కులో అభివృద్ధి పనులను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న ఎంఐఎం నాయకులు అబ్రార్ తదితరులు

మలక్ పేట ,అక్టోబర్ 25, ప్రభాతవార్త:
అజంపుర డివిజన్ లోని పార్కులను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని అబ్రార్ పేర్కొన్నారు. డివిజన్ లోని ఫరత్ నగర్ పార్క్ లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను సంబంధిత అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ లో ఇప్పటివరకు పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని వివరించారు. త్వరలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడానికి వివిధ శాఖల అధికారులతో కలిసి ప్రణాళికలను రూపొందిస్తున్నమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈ మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

కెటిఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

నేరేడ్‌మెట్ అక్టోబర్ 25 :ప్రభాతవార్త :
జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో బిఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్ విజయాన్ని సాధించేందుకు పార్టీ శ్రేణులు సమష్టిగా కృషి చేయాలని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఆదేశించారు.శనివారం తెలంగాణ భవన్‌లో ఆయన అధ్యక్షతన గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ ఇన్‌చార్జీలు, జిహెచ్ఎంసి కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ - ఉపఎన్నికలో ప్రతి బూత్ స్థాయిలో పార్టీ బలాన్ని పెంపొందించాలని, ఓటర్లతో నిరంతర సంబంధాలు కొనసాగిస్తూ, అభ్యర్థి గెలుపు కోసం సమర్థ వ్యూహరచన చేయాలని సూచించారు.సోమాజిగూడ క్లస్టర్ పరిధిలోని శ్రీనగర్ కాలనీ బూత్ నంబర్లు 303 నుండి 310 వరకు ఇన్‌చార్జిగా ఉన్న మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఆయనతో పాటు పలువురు కార్పొరేటర్లు, పార్టీ సీనియర్ నాయకులు కూడా సమావేశానికి హాజరయ్యారు. ఉపఎన్నికలో అభ్యర్థి విజయమే పార్టీ ప్రతిష్ట కాబట్టి ప్రతి ఒక్కరు సమన్వయంతో పనిచేయాలని, బూత్ కమిటీలు, డివిజన్ వారీగా బాధ్యతలు కేటాయించి ఎన్నికల పనులు చురుకుగా కొనసాగించాలని కేటీఆర్ స్పష్టం చేశారు.

సిజెఐపై దాడిని ఖండించిన ఎమ్మార్పీఎస్

- నవంబర్ 1న చలో హైదరాబాద్ విజయవంతం చేయాలి

నేరేడ్ మేట్, అక్టోబర్ 25,ప్రభాతవార్త : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ నవంబర్ 1న హైదరాబాద్‌లో జరిగే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు పిలుపునిచ్చారు.నేరేడ్మెట్ అంబేద్కర్ భవన్‌లో శనివారం జరిగిన సమావేశంలో ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు తిప్పారపు లక్ష్మణ్ మాదిగ, జిల్లా అధ్యక్షులు కేశపాగ రామచందర్ మాదిగ మాట్లాడుతూ - చీఫ్ జస్టిస్‌పై దాడి కేవలం ఒక వ్యక్తిపై దాడి కాకుండా దేశవ్యాప్తంగా ఉన్న దళితులను అవమానించినట్టేనని పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని రక్షించేందుకు ప్రతి బస్తీ, గ్రామం నుంచి ప్రజలు ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు పంగ ప్రణయ్ మాదిగ ఆధ్వర్యంలో ఎంజెఎఫ్ రాష్ట్ర నాయకులు మనోహర్, సీనియర్ నాయకులు అంజి మాదిగ, శ్రీను పాల్గొన్నారు.

పోలీసు అమరవీరుల ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలి

పోలీస్ బ్లాక్ లో భాగంగా చర్లపల్లి పిఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం.

కుషాయిగూడ అక్టోబర్ 25, ప్రభాతవార్త.
నిర్వహణలో అసువులు బాసిన పోలీస్ అమరవీరుల ఆశయాలను ఆదర్శంగా తీసుకొని ప్రతి పోలీసు విధి నిర్వహణలో చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని చల్లపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ సుధాకర్ పేర్కొన్నారు. పోలీస్ ఫ్లాగ్ కార్యక్రమంలో భాగంగా శాంతినికేతన్ పాఠశాల విద్యార్థులతో కలిసి చల్లపల్లి పోలీసులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ప్రజల రక్షణ కోసం తమ ప్రాణాలనుఫలంగా పెట్టిన పోలీసు ఉన్నతాధికారుల తో పాటు సిబ్బంది ఆశయాలను అమలు జరిపే క్రమంలో ప్రతి ఒక్కరు క్రిస్టియానిటీ ఇచ్చారు. సమాజంలో పంపండి చేయడానికి నేరలను అదుపు చేయడానికి పోలీసులు ప్రజల సహకారం ఎందుకు అవసరమని కోరారు. ఈ కార్యక్రమంలో సుమారు 60 మంది విద్యార్థులు పోలీస్ స్టేషన్ పరిధి పాల్గొన్నారు.

మలక్ పేట కేర్ ఆస్పత్రిలో విజయవంతంగా అత్యంత క్లిష్టమైన గుండె శాస్త్ర చికిత్స

మలక్ పేట ,అక్టోబర్ 25, ప్రభాతవార్త:
మలక్ పేట కేర్ ఆస్పత్రిలో అరుదైన అత్యంత క్లిష్టమైన గుండె శాస్త్ర చికిత్స ను ఆసుపత్రి వైద్యులు సమిష్టి కృషితో విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆసుపత్రి సీనియర్ కార్డియో తోరాసిక్ వాస్కులార్ సర్జన్ డాక్టర్ సుదీర్ గండ్రకోట, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ప్రవీణ్ కుమార్ ఎడ్ల లు మాట్లాడుతూ నల్గొండకు చెందిన ఎల్లయ్య (69) పది రోజుల క్రితం తీవ్రమైన జ్వరం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఉండడంతో మలక్ పేటలోని కేర్ హాస్పిటల్లో చికిత్స నిమిత్తం చేరడం జరిగింది అని తెలిపారు. వైద్య పరీక్షలలో ఆయనకు బైకస్పిడ్ అయార్టిక్ వాల్వులో తీవ్రమైన స్టెనోసిస్, గుండె బలహీనత తదితర తీవ్రమైన గుండె సంబంధిత సమస్యలు ఉన్నట్లు తెలిందని వివరించారు. మొదట వైద్యులు యాంటీబయాటిక్స్, ఇనో ట్రోప్స్ ఇతర చికిత్సలతో స్థిరపరిచే ప్రయత్నం చేసినప్పటికీ పరిస్థితి క్షీణించి కాలేయం, మూత్రపిండాలపై ప్రభావం చూపిందని తెలిపారు. అధిక ప్రమాదాన్ని దృష్టిలో ఉంచుకుని కార్డియాక్ సర్జరీ బృందం కరోనరీ ఆర్టరీ బైపాస్ గ్రాఫ్టింగ్ తో పాటు బయోప్రోస్తెటిక్ వాల్వ్ ఉపయోగించి ఆయార్టిక్ వాల్వ్ రిప్లేస్మెంట్ చేయాలని నిర్ణయించి, శాస్త్ర చికిత్స గురించి కుటుంబ సభ్యులకు వివరించి, కార్డియాక్ సర్జరీ బృందం, క్రిటికల్ కేర్ బృందం, అనస్థియా బృందాలు సమిష్టి కృషితో అత్యంత అరుదైన, అత్యంత క్లిష్టమైన గుండె శాస్త్ర

రోగికి విజయవంతంగా శాస్త్ర చికిత్స చేసి వివరాలను వెల్లడిస్తున్న డాక్టర్ సుదీర్ గండ్రకోట, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ప్రవీణ్ కుమార్ ఎడ్ల లు తదితరులు

చికిత్సను విజయవంతంగా నిర్వహించారు. శాస్త్ర చికిత్స అనంతరం రోగికి జ్వరం తగ్గడంతో పాటు కాలేయం, మూత్రపిండాల పనితీరు క్రమంగా మెరుగవడంతో పాటు పదవ రోజున ఆయనను ఆరోగ్యంగా స్థిరమైన పరిస్థితిలో ఆసుపత్రి నుంచి డిస్చార్జ్ చేయడం జరిగిందని వివరించారు.రోగి ఆసుపత్రి వైద్య బృందం అందరూ అహర్నిశలు శ్రమించారని తెలిపారు. కేర్ ఆస్పత్రిలో ఉన్న ఆధునాతన వైద్య నైపుణ్యం, బృందం కృషికి నిదర్శనం ఈ అరుదైన శస్త్ర చికిత్స అని తెలిపారు. ప్రపంచస్థాయి సదుపాయాలు, కరుణతో కూడిన సంరక్షణతో మలక్ పేట కేర్ హాస్పిటల్స్ లో ఇటువంటి అరుదైన గుండె శాస్త్ర చికిత్సను అందిస్తున్నామని, ఎంతో క్లిష్టమైన పరిస్థితుల్లోనైనా మా ఆసుపత్రి వైద్యులు ప్రాణాలను రక్షించేందుకు అదనపు కృషి చేస్తున్నారని వివరించారు.

గుర్రంగూడలో బడంగ్‌పేట్ కార్పొరేషన్ కమిషనర్ పర్యటన

-కెఎల్ఆర్ సూచనలతో సమస్యల పరిశీలనకు వచ్చిన సరస్వతి

సరూర్‌నగర్, అక్టోబర్ 25 ప్రభాతవార్త: మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి, కాంటెస్టెడ్ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి సూచనల మేరకు శనివారం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ పి.సరస్వతి గుర్రంగూడలో పర్యటించి ప్రజా సమస్యలను పరిశీలించారు. వివిధ కాలనీలకు చెందిన సంక్షేమ సంఘాల నాయకులు, కాలనీ వాసులు కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో ఇటీవల తుక్కుగూడలోని మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో కిచ్చెన్నను కలిసారు ఈ సందర్భంగా కార్పొరేషన్‌లోని గుర్రంగూడకు సంబంధించిన 6, 7 డివిజన్ల లోని కాలనీల్లో డ్రైనేజీ, అంతర్గత రోడ్లు, ప్రధాన రహదారుల సమస్యలు తీవ్రంగా ఉన్నాయని ఆయన దృష్టికి తేవడం జరిగింది. ఈ నేపథ్యంలో స్పందించిన కెఎల్ఆర్ కమీషనర్‌కు ఫోన్ చేసి గుర్రంగూడలో సమస్యలను పరిశీలించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. దీంతో శనివారం ఆమె గుర్రంగూడకు వచ్చి స్థానిక టీచర్స్ కాలనీ, సౌభాగ్యలక్ష్మీ కాలనీ, బృందావన్ కాలనీలతో పాటు గుర్రంగూడ పాత గ్రామంలో పర్యటించి సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు స్థానిక సమస్యలకు సంబంధించి కమీషనర్‌కు ఒక వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి, గుర్రంగూడ కాంగ్రెస్ నాయకులు జక్కిడి విష్ణువర్ధన్‌రెడ్డి గడ్డం లింగారెడ్డి, గుర్రం లక్ష్మీ నర్సమ్మ, గొరిగె అయిలమ్మ, పుట్టగళ్ళ భాస్కర్, కాలనీ సంఘాలకు చెందిన శ్రీనివాసరావు, మధు, పద్మ భూషణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుర్రంగూడలో పర్యటిస్తున్న బడంగ్‌పేట్ కమీషనర్ సరస్వతి: చిత్రంలో జక్కిడి విష్ణువర్ధన్‌రెడ్డి, బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి, గుర్రం లక్ష్మీ నర్సమ్మ తదితరులు

కమీషనర్ అసంపూర్తి పర్యటన.. స్థానికుల అసంతృప్తి
గుర్రంగూడ పర్యటనకు శనివారం వచ్చిన కమీషనర్ సరస్వతి రెండు, మూడు కాలనీల్లో మాత్రమే పర్యటించి ఓల్డ్ విలేజ్ వరకు వచ్చి వెళ్ళడం విమర్శలకు దారి తీసింది. బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని ముఖ్యమైన ప్రాంతాల్లో ఒకటైన గుర్రంగూడకు సంబంధించిన 6, 7 డివిజన్ల లో పాత గ్రామంతో పాటు చాలా కాలనీలు ఉన్నాయి. గత మూడు, నాలుగు నెలల నుండి కురుస్తున్న భారీ వర్షాలకు ఈ ప్రాంతాల్లో ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రోడ్లు దారుణంగా మారాయి. అదే విధంగా డ్రైనేజీలు సైతం అస్తవ్యస్తంగా మారాయి. ఈ నేపథ్యంలో కాలనీల ప్రజలతో పాటు స్థానిక గుర్రంగూడ పాత గ్రామం ప్రజలు ఆయా సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో సమస్యలను కెఎల్ఆర్ దృష్టికి తేవడంతో ఆయన సూచనల మేరకు గుర్రంగూడకు వచ్చిన కమీషనర్ నామమాత్రంగా పర్యటించి వెళ్ళడం విమర్శలకు దారి తీసింది. మూడు కాలనీలు మాత్రమే తిరిగి పాత గ్రామం వరకు వచ్చి సమయం లేదు.. ఫోన్లు వస్తున్నాయంటూ కమీషనర్ మిగతా ప్రాంతాల్లో పర్యటించకుండా వెళ్ళిపోవడంతో పలువురు అసంతృప్తి వ్యక్తం చేశారు.

పోలీసుల త్యాగాలు చిరస్మరణీయం : ఇన్‌స్పెక్టర్ సందీప్ కుమార్

నేరేడ్‌మెట్‌లో అమరవీరుల జ్ఞాపకార్థం సైకిల్ ర్యాలీ

నేరేడుమెట్, అక్టోబర్ 25,ప్రభాతవార్త :
పోలీసుల అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని నేరేడుమెట్ పోలీసు స్టేషన్ పరిధిలో 200మంది విద్యార్థుల చే సైకిల్ ర్యాలీ ఘనంగా నిర్వహించారు. ఇన్స్పెక్టర్ సందీప్ కుమార్ ఆదేశాల మేరకు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, రాజధాని హైస్కూల్ విద్యార్థులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. మూడు గుడులు ప్రాంతం నుంచి నేరేడుమెట్ చౌరస్తా వరకు సాగిన ఈ ర్యాలీలో విద్యార్థులు ఉత్సాహంగా నినాదాలు చేస్తూ అమరుల త్యాగాలను స్మరించుకున్నారు.ఈ సందర్భంగా సీఐ సందీప్‌కుమార్ మాట్లాడుతూ - విధి నిర్వహణలో ప్రాణాలను అర్పించిన పోలీసుల త్యాగాలు వెలకట్టలేనివని, వారి ఆశయాలను కొనసాగించాల్సిన బాధ్యత నేటి యువతపై ఉందని పేర్కొన్నారు. సమాజ శాంతి భద్రత కోసం తమ ప్రాణాలను పణంగా పెట్టిన పోలీసుల సేవలు చిరస్మరణీయమని ఆయన గుర్తుచేశారు.పోలీసు

శాఖ ఎల్లప్పుడూ ప్రజల రక్షణకు అహర్నిశలు కృషి చేస్తుందని, క్రమశిక్షణ, నిబద్ధత, సేవాభావంతో పనిచేయడం ద్వారా విద్యార్థులు కూడా తమ జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని సీఐ విద్యార్థులకు సూచించారు.సమాజంలో శాంతి భద్రతలు కాపాడేందుకు ప్రాణత్యాగం చేసిన అమరవీరుల జ్ఞాపకార్థం ఈ ర్యాలీ విజయవంతంగా నిర్వహించబడిందని పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బ్యాంక్‌కాలనీ దుర్గామాత ఆలయంలో సామూహిక వ్రతాలు

ఉప్పల్, అక్టోబరు 25 ప్రభాతవార్త :
ఉప్పల్ బ్యాంక్‌కాలనీ దుర్గామాత ఆలయంలో శనివారం కార్తీక మాసం సందర్భంగా సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటి అధ్యక్షుడు ఎస్.వినోద్ కుమార్ ఉపాధ్యక్షుడు జె.రమేష్ గౌడ్, కార్యదర్శి టి.సందీప్ భూషణ్, కోశాధికారి టి.మనోజ్ కుమార్, కార్యనిర్వహక కార్యదర్శి శేఖర్ మోర్, సభ్యులు వి వెంకటేశ్వర్లు,కె విజయ్‌కుమార్, ఇ.రాజమణి,ఎన్.శ్రీనివాస్,వాలంటీర్లు జి. ప్రదీప్ కుమార్, శ్రీలత, జ్యోతి, సుజాత, పార్వతి, జ్యోతిర్మయి, కిరణ్మయి, సునీత తదితరుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భక్తులు సత్యనారాయణస్వామి వత్రాలు నిర్వహించారు. కార్తీక మాసం సందర్భంగా ప్రతి ఏటా అమ్మవారి ఆలయంలో ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు.

ఉప్పల్ బ్యాంక్‌కాలనీలో దుర్గామాత ఆలయంలో కార్తీక మాస వ్రతాలు నిర్వహిస్తున్న ఆలయ కమిటి నేతలు

ఉత్సవాల సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని సర్వంగా సుందరంగా ముస్తాబు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆలయ కమిటి నేతలు,పాల్గొన్నారు.

చిన్న చెరువు సుందరీకరణ చేయాలని కమిషనర్‌కు వినతి

చిన్న చెరువు శుద్ధి చేయాలని కమిషనర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న రామంతాపూర్ డివిజన్ నేతలు

రామంతాపూర్, అక్టోబరు 25 ప్రభాతవార్త : రామంతపూర్ లోని చిన్న చెరువు మురుగునీరు, చెత్తాచెదారంతో నిండిపోయిందని, చెరువులో వ్యర్థాలు తొలగించాలని పలువురు రామంతాపూర్ డివిజన్ నేతలు శనివారం డిప్యూటి కమిషనర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈసంద ర్భంగా జరిగిన కార్యక్రమంలో రామంతాపూర్ డివిజన్ నేతలు కోండ్రన్ పల్లి గిరిబాబు, బుర్ర మహేందర్ ముది రాజ్, బండారు బిక్షపతి, నడిగొట్టి చంద్రం తదితరులు కమిషనర్‌ను కలిసి పలు సమస్యలు విన్నవించారు. చిన్న చెరువులోకి డ్రైనేజీ నీరు వచ్చి చేరుతుందని, వాకింగ్ ట్రాక్ ప్రజలకు అందుబాటులోకి తీసుకుని రావాలని సూచించారు. చెరువు చుట్టూ పెన్సింగ్ ఏర్పాటు చేయాలని, చెరువు సుందరీకరణ చేపట్టాలని వారు కోరారు. దీనిపై ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడి తగు చర్యలు తీసుకుంటామని కమిషనర్ రాజు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు కాలనీ నేతలు పాల్గొన్నారు.

పహాడీషరీఫ్ మాజీ వార్డు మెంబర్ నాసర్ అవల్గీ మృతి

సరూర్‌నగర్, అక్టోబర్ 25 ప్రభాతవార్త:
పూర్వ సరూనగర్ మండలంలోని పహాడీషరీఫ్ గ్రామ పంచాయతీ మాజీ వార్డు సభ్యుడు, ప్రస్తుత జల్‌పల్లి మున్సిపాలిటీలో సీనియర్ బిఆర్ఎస్ నాయకుడు, మహేశ్వరం నియోజకవర్గ మైనారిటీ ముఖ్య నేత నాసర్ బిన్ అవల్గీ మృతి చెందారు. కాలేయ వ్యాధి సమస్యలతో ఇబ్బందులు పడుతూ చికిత్స పొందుతున్న ఆయన తుది శ్వాస విడిచారు. పహాడీషరీఫ్ గ్రామ అభివృద్ధిలో ఇక్కడి ప్రజాసమస్యల పరిష్కారంలో ముందుండే నాయకుల్లో ఒకరైన నాసర్ అవల్గీ మృతితో స్థానికంగా విషాద ఛాయలు అలముకున్నాయి. ఆయన మృతి పట్ల మాజీ సర్పంచ్‌లు అబ్దుల్లా బిన్ అవధ్, మిరాజ్ ఖాన్, మాజీ కారోబార్ యాంజాల శ్రీధర్, కొత్తపేట్ మాజీ ఎంపిటిసి తయ్యబ్ దయాని, పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, రాజకీయాలకతీతంగా పలువురు నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. నాసర్ అవల్గీ అంత్యక్రియలు శుక్రవారం బార్కాస్ బడీ ఖబరస్థాన్‌లో జరిగాయి.

నాసర్ అవల్గీ (ఫైల్ ఫోటో)

ఉప్పల్ ఎమ్మెల్యే బిఎల్ఆర్‌ను కలిసిన మల్లాపూర్ చాణక్యపురి కాలనీ సంక్షేమ సంఘం నాయకులు

ఎమ్మెల్యేను శాలువాతో సన్మానిస్తున్న సంక్షేమ సంఘం నాయకులు

నాచారం, అక్టోబర్ 25 ప్రభాతవార్త : మల్లాపూర్ డివిజన్ చాణక్యపురి కాలనీ సంక్షేమ సంఘం నాయకులు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని కలిసి సమస్యలను తెలియజేస్తూ వినతిపత్రాన్ని అందజేశారు. కాలనీలోని దుర్గా మల్లేశ్వరి పోచమ్మ దేవాలయ సమస్యలపై, కాలనీ లో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. అందుకు సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే బీఎల్ఆర్ లక్ష్మారెడ్డి కాలనీ అభివృద్ధికి తన సహాయ సహకారాలు ఎప్పుడు ఉంటాయని త్వరలోనే కాలనీ సంబంధించిన సమస్యల పరిష్కారం కృషి చేస్తానని దుర్గా మల్లేశ్వరి పోచమ్మ దేవాలయం సమస్య పరిష్కరణ కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు దశరథ్, ఉపాధ్యక్షులు వి. శ్రీనివాస్,జనరల్ సెక్రెటరీ కిషోర్ గౌడ్, నర్సింగ్ రావు తధితరులు పాల్గొన్నారు.

నాచారం పోలీస్ స్టేషన్ లో ఓపెన్ హౌస్

పోలీస్ స్టేషన్ గురించి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఇన్స్పెక్టర్ ధనుంజయ గౌడ్

నాచారం, అక్టోబర్ 25 ప్రభాతవార్త : పోలీస్ సంస్మరణ దినోత్సవం సందర్భంగా నాచారం పోలీస్ స్టేషన్ లో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఓపెన్ హౌస్ సందర్భంగా నాచారంలోని కమలా మెమోరియల్ స్కూల్ విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వారికి రిసెప్షన్, సీసీటీవీల నిర్వహణ, లాకప్, పోలీస్ స్టేషన్ యొక్క వివిధ విధుల గురించి వివరించారు. నాచారం ఇన్స్ పెక్టర్ ధనంజయ్ గౌడ్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఓల్డ్ ఎల్‌బినగర్‌లో కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి పర్యటన

స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి

సైదాబాద్, అక్టోబరు 25 ప్రభాతవార్త: లింగోజిగూడ డివిజన్ పరిధిలోని ఓల్డ్ ఎల్‌బినగర్ గ్రామంలో కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి శనివారం పర్యటించి స్థానిక సమస్యలను పరిశీలించారు. కొన్ని చోట్ల రోడ్లు, డ్రైనేజి లైన్ల లెవల్స్ సరిగ్గా అనుసంధానించక పోవడం వల్ల వర్షపు నీరు రోడ్లపై నిలుస్తుందని స్థానికులు ఫిర్యాదు చేయడంతో సమస్య శాశ్వత పరిష్కారం కోసం వర్షపు నీరు నిల్వ ఉండకుండా మూడు ప్రధాన చౌరస్తాలలో నూతనంగా గటర్లు ఏర్పాటు చేస్తామని కార్పొరేటర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఇ విజయ్ కుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాకేష్, వాటర్‌వర్క్స్ డిఇ సన్యాసిరావు, హైడ్రా టీం సూపర్‌వైజర్ రాజు, కాలనీవాసులు శ్రీధర్‌గౌడ్, గోపి, ప్రవీణ్, నాగేష్, షనవాజ్, రాజు, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

సివరేజీ ప్లాంటు నిర్మాణం నిలిపివేయాలని ఎమ్మెల్యేకు వినతి

ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి వినతి పత్రం సమర్పిస్తున్న ఉప్పల్ కురుమనగర్ కాలనీ నేతలు దృశ్యం.

ఉప్పల్, అక్టోబరు 25 ప్రభాతవార్త : ఉప్పల్ డివిజన్ కురుమ నగర్ కాలనీ హనుమాన్ ఆలయం వెనుక నిర్మిస్తున్న సివరేజీ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను మరో చోటకు తరలించాలని పలువురు కాలనీ నేతలు శనివారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఉప్పల్ కురుమనగర్, లక్ష్మి నరసింహాకాలనీ, ఉప్పల్‌హిల్స్, శ్రమదాన్ సొసైటి కాలనీ నేతలు బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత పిల్లి నాగరాజు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిని కలిసి విన్నవించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఉప్పల్ భగాయత్ హనుమాన్ ఆలయం వెనుక సివరేజీ ప్లాంటు నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందించారని, దీని వల్ల తమ కాలనీలకు దురాస్వన వస్తుందని, రోగాలు వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. సుమారు రెండు వేల మంది ప్రజలు స్థానికంగా నివాసం ఉంటున్నారని, ప్లాంటు నిర్మించకుండా తగు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి విన్నవించారు. దీనిపై ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి స్పందిస్తూ త్వరలోనే జలమండలి ఎండి అశోక్‌రెడ్డిని కలిసి సమస్యలు విన్నవిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు కాలనీ సంఘం నేతలు పాల్గొన్నారు.

ఉప్పల్ మినీ శిల్పారామంలో ఆకట్టుకున్న ప్రదర్శనలు

ఉప్పల్ మినీ శిల్పారామంలో కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహిస్తున్న కళాకారులు దృశ్యం

ఉప్పల్, అక్టోబరు 25 ప్రభాతవార్త : ఉప్పల్ మినీ శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా శనివారం సాధన కళా కేంద్ర నిర్వహకురాలు శాంతిశ్రీ శిష్య బృందం ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య ప్రదర్శన ఆహుతులను ఎంతో ఆకట్టుకుంది. ఈసందర్భంగా మహాగణపతిమ్, మహాలక్ష్మి అష్టకం, యశోద కృష్ణ, అయిగిరినందిని, కల్యాణ రామ, వెంకటాచలం, అష్టపది, హిమగిరి తనయే, గీతాంజలి, మూషిక వాహన కామాక్షిస్తుతి తదితర అంశాలను కళాకారులు సాయి శ్రావ్య, సింధు, అవంతిక, హారిక, శాంతిశ్రీ, సింధు, సంవిక తదితరులు ప్రదర్శించి మెప్పించారు. శనివారం సెలవు దినం కావడంతో సందర్శకుల నుంచి మంచి స్పందన ఉందని నిర్వహకులు తెలిపారు.

ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులను తనిఖీలు చేయాలి : సిపిఐ

ఉప్పల్ రవాణాశాఖ అధికారి రవీందర్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న సిపిఐ నేతలు టి.సత్యప్రసాద్, రచ్చ కిషన్ తదితరులు

ఉప్పల్, అక్టోబరు 25 ప్రభాతవార్త : తెలంగాణలో ప్రైవేటు ట్రావెల్స్ బస్సులను నిరంతరం తనిఖీలు చేయాలని సిపిఐ ఉప్పల్ మండల కార్యదర్శి టి .సత్య ప్రసాద్, సిపిఐ మేడిపల్లి మండల కార్యదర్శి రచ్చ కిషన్‌లు కోరారు. ఈ మేరకు శనివారం ఉప్పల్ రవాణాశాఖ కార్యాలయంలో ఎంవిఐ రవీందర్‌రెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ కర్నూల్‌లో జరిగిన సంఘటన తీవ్ర బాధాకరమని, ఈ సంఘటనతో అధికారులు ప్రైవేట్ ట్రావెల్స్ చేసే మోసాలను గ్రహించి, మరోసారి ఇలాంటి ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ట్రావెల్స్ యజమానులకు తగు సూచనలు చేయాలని, నకిలీ రిజిస్ట్రేషన్లు అరికట్టాలని, లైసెన్స్ లేని వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. పిటినెస్ లేని వాహనాలు సీజ్